


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 18 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 90 పేజీలు : 4 వెల : రూ 3-00


## స్కూళ్లల్లో సదుపాయాలపై సమస్యలకు ఒక నెంబర్ ఉండాలి: సీఎం జగన్



తాడేపల్లి : విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల అమలుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమిక్ష సమావేశం నిర్వహించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో నూతన విద్యా విధానం అమలు, తీసుకున్న చర్యలపై ముఖ్యమంత్రి ఆరాతీశారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా టీచర్లను నియమించడంతోపాటు, సబ్జెక్టుల వారీగా టీచర్లు, వారితో బోధనే లక్ష్యంగా నూతన విద్యా విధానం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్స్, ఫౌండేషనల్ స్కూల్స్, ఫౌండేషనల్ ప్లస్‌స్కూల్స్, ప్రీ హైస్కూల్స్, హైస్కూల్స్, హైస్కూల్ ప్లస్ స్కూల్స్‌పై సీఎం జగన్‌కు అధికారులు వివరాలు అందించారు. 2021?22 నుంచి 2022?23, 2023?24 వరకూ మూడు విద్యా సంవత్సరాల్లో నూతన విద్యా విధానం మూడు దశలుగా పూర్తిగా అమలు కానున్నట్లు అధికారులు సీఎంకు చెప్పారు. దీనిలో భాగంగా 25,396 ప్రైమరీ పాఠశాలలను యూపీ(అప్పర్ ప్రైమరీ) స్కూళ్లు, హైస్కూళ్లలో విలీనం చేయనున్నట్లు తెలిపారు. తొలిదశలో భాగంగా ఈ విద్యా సంవత్సరం 2,663 స్కూళ్లు విలీనం చేశామని, 2,05,071 మంది విద్యార్థులు నూతన విద్యావిధానం అనుసరించి విలీనం అయ్యారని పేర్కొన్నారు. మొత్తంగా ఈ ప్రక్రియలో 9.5 లక్షల మంది విద్యార్థులకు నూతన విద్యావిధానం ఈ సంవత్సరమే అందుబాటులోకి వచ్చిందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. రానున్న విద్యా సంవత్సరంలో నూతన విద్యావిధానం అమలు చేయడానికి అవసరమైన చోట్ల అదనపు తరగతి గదుల నిర్మాణంపై దృష్టిపెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన కార్యాచరణ పూర్తిచేసి వెంటనే పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మొత్తం ప్రక్రియ పూర్తయ్యేనాటికి అవసరమైన టీచర్ల సంఖ్యను కూడా గుర్తించాలని సీఎం జగన్ ఆదేశించారు. 1092 స్కూల్స్ 2021?22 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ అఫిలియేషన్ జరిగాయని అధికారులు వివరించారు. ఈ విద్యార్థులు 2024?25 నాటికి పదోతరగతి పరీక్షలు రాస్తారని తెలిపారు. అంతర్జాతీయంగా 24వేల స్కూళ్లకు మాత్రమే సీబీఎస్ఈ అఫిలియేషన్ ఉందని పేర్కొన్నారు. ఒక దేశంలో ఒక ఏడాది, అదికూడా ఒక రాష్ట్రంలో 1092 స్కూళ్లకు సీబీఎస్ఈ అఫిలియేషన్ ఇవ్వడం రికార్డని అధికారులు తెలిపారు. టీచర్ ట్రైనింగ్ ఇస్తున్న డైట్ సంస్థల సమర్థత పెంచాలని సీఎం ఆదేశించారు. టీచర్లకు అత్యంత నాణ్యమైన శిక్షణ అందాలని అన్నారు. టీచర్లకు శిక్షణకార్యక్రమాలపై వచ్చే సమావేశంలో వివరాలు అందించాలని సూచించారు. స్కూళ్లో సదుపాయాలపై ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే వెంటనే కాల్‌చేసేలా ఒక నంబర్ పెట్టాలని ఆదేశించారు. ప్రతి స్కూళ్లో అందరికీ కనిపించేలా ఈ నంబర్‌ను ప్రదర్శించాలని, ఈ కాల్‌సెంటర్‌ను అధికారులు పర్యవేక్షణ చేసిన వారినుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం జగన్ స్పష్టం చేశారు. ఇంగ్లిషు ఉచ్ఛారణ, భాష, వ్యాకరణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం పేర్కొన్నారు. పిల్లలకు ఇదివరకే డిక్షరీలు ఇచ్చామని, వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతిరోజూ కనీసం మూడు పదాలు నేర్పించాలని, ఆ పదాలను వినియోగించడంపై పిల్లలకు నేర్పించాలని ఆదేశించారు. ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వానికి అప్పగించడం అన్నది పూర్తిగా స్వచ్ఛందం అని సమావేశంలో మరోసారి సీఎం స్పష్టం చేశారు.

## సమాఖ్య ప్రజాస్వామ్యంలో రాష్ట్రాల పాత్ర చాలా ముఖ్యం : మోదీ



సిమ్లా : భారత దేశంలో ప్రజాస్వామ్యం కేవలం ఓ వ్యవస్థ కాదని, అంతకన్నా ఎక్కువ అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ సమాఖ్య ప్రజాస్వామిక వ్యవస్థలో రాష్ట్రాల పాత్రకు చాలా ప్రాధాన్యం ఉందన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్ళు పూర్తి కాబోతున్న తరుణంలో అంతకుముందు రానున్న 25 సంవత్సరాల్లో ప్రతి వ్యక్తి తన కర్తవ్యాన్ని నిర్వహించడమే ఓ మంత్రమని, ఇది దేశాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఈ సందేశం పార్లమెంటు, రాష్ట్రాల శాసన సభల నుంచి వెలువడాలన్నారు. దేశ ఐకమత్యం, సమగ్రతలకు విఘాతం కలిగించే చర్యల పట్ల చట్ట సభలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. ఇతరులపై రాజకీయపరమైన అనుచిత వ్యాఖ్యలు లేకుండా, శ్రద్ధగా, హుందాతనంతో చట్టసభల్లో నాణ్యమైన, ఆరోగ్యకరమైన చర్చల కోసం ప్రత్యేక సమయం కేటాయించాలని పిలుపునిచ్చారు. చట్ట సభల సభ్యుల ప్రవర్తన భారతీయ విలువలకు అనుగుణంగా ఉండాలని చెప్పారు. 82వ ఆలిండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ సిమ్లాలో బుధవారం ప్రారంభమైంది. ఈ సమావేశంలో మోదీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా పాల్గొన్నారు.

## కుప్పంలో కుప్పకూలిన టీడీపీ

కుప్పంలో చంద్రబాబుకు బిగ్‌షాక్ తగిలింది. ఇప్పటికే జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లను కోల్పోయిన టీడీపీ.. తాజాగా మున్సిపల్ ఎన్నికల్లోనూ బొక్కబోర్లా పడింది. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో 19 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. భారీ మెజారిటీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయ ఢంకా మోగించారు. మొదటి రౌండ్‌లో 15 వార్డులకుగాను 13 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించగా.. టీడీపీ కేవలం రెండు వార్డులకే పరిమితమైంది. తర్వాత వెలువడిన ఫలితాల్లోనూ టీడీపీ అభ్యర్థులు తేరుకోలేకపోయారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలనకు కుప్పం మున్సిపాలిటీ ప్రజలు పట్టం కట్టారు. ఇక 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందంటూ చెప్పుకునే చంద్రబాబు సొంత నియోజకవర్గంలోని కుప్పం మున్సిపాలిటీని కాపాడుకోలేకపోయారు.



## వైసీపీకే జై కొడుతున్నజనం



విజయవాడ, నవంబర్ 17, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్‌లో వివిధ కారణాలతో నిలిచిపోయిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఇవాళ వెలువడుతున్నాయి. నెల్లూరు కార్పొరేషన్ సహా 13 మున్సిపాలిటీల కౌంటింగ్ నిర్వహిస్తున్నారు ఎన్నికల అధికారులు. ఇందులో ఇప్పటివరకు వెలువడిన ఫలితాల్లో 9 మున్సిపాలిటీలను అధికార పార్టీ వైసీపీ కైవసం చేసుకుంది. టీడీపీ అధినేత ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం మున్సిపాలిటీతో సహా ఆకివీడు, పెనుకొండ, బేతంచర్ల, కమలాపురం, రాజంపేట, గురజాల, బుచ్చిరెడ్డిపాలెం, దాచేపల్లిలో వైసీపీ విజయ ఢంకా మోగించింది. ప్రకాశం జిల్లా దర్శిలో మాత్రం టీడీపీ గెలుపొందింది. ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం జరిగిన మున్సిపల్ ఎన్నికలకు ఓట్ల లెక్కింపు బుధవారం ఉదయం ప్రారంభం అయ్యింది. పెండింగ్ లో ఉన్న మున్సిపాల్టీలకు ఈ నెల 15న పోలింగ్ జరిగింది. పోలింగ్ సందర్భంలో ప్రధాన పార్టీలు ఈ ఎన్నికలను ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పోటీ పోటీగా ప్రచారం చేశాయి. ఇక, ఇప్పుడు జరిగే కౌంటింగ్ పైన అదే స్థాయిలో ఉత్కంఠ కొనసాగింది. నెల్లూరు కార్పొరేషన్ సహా 13 మునిసిపాలిటీలు, నగర పంచాయతీలతో పాటు, మరో 10 మునిసిపాలిటీల్లో ఖాళీగా ఉన్న డివిజన్లు, వార్డులకు జరిగిన ఎన్నికల ఫలితాలు బుధవారం వెల్లడయ్యాయి. ఎట్టకేలకు ఉత్కంఠకు తెరపడింది. ముఖ్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం మున్సిపాలిటీ మొదటి నుంచి చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ తిరిగి తమ పట్టు నిలవుకోవాలని తెలుగుదేశం పార్టీ విశ్వ ప్రయత్నాలు చేసింది. ఇది చంద్రబాబు కంచు కోట కావడంతో.. ఇక్కడ గెలిచి విజయం మెలేయాలని వైసీపీ వ్యూహం పన్నింది. ఈ పోటాపోటీ వాతావరణంలో.. కుప్పం ఫలితం అధికార పార్టీ వైసీపీనే వరించింది. ఇదిలావుంటే, ఆయా మునిసిపాలిటీల్లో 325 డివిజన్లు, వార్డులకు సోమవారం ఎన్నికలు జరిగాయి. 325 స్థానాలకు 1,206 మంది అభ్యర్థులు పోటీవడ్డారు. ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. మొత్తం 23 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఇక సోమవారం జరిగిన పోలింగ్‌లో 8,62,066 మందికిగాను 5,14,086 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించిన అనంతరం సాధారణ ఓట్లు లెక్కించారు. 23 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్లు లెక్కించడానికి 450 టేబుళ్లు ఏర్పాటుచేశారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లుగా 534 మందిని, అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్‌వైజర్లుగా 3,792 మందిని నియమించారు. మొదటి నుంచి మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో 54 డివిజన్‌లు ఉండగా ఏకగ్రీవమైన 8 డివిజన్‌లు కాకుండా, మిగిలిన 46 డివిజన్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆయా డివిజన్లలో పోలైన ఓట్లు లెక్కించడానికి 142 టేబుళ్లు ఏర్పాటుచేశారు. అదే విధంగా కుప్పంలో 24 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇక్కడ 14 టేబుళ్లు సమకూర్చారు.


## అపోహాలు వద్దు.. 'ఎయిడెడ్' అప్పగింత పూర్తిగా స్వచ్ఛందం

అమరావతి: ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వానికి అప్పగించడం అన్నది పూర్తిగా స్వచ్ఛందమని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. వివిధ కారణాలతో నడుపుకోలేని పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వం ఒక అవకాశం కల్పిస్తుందని గుర్తు చేశారు. ఇష్టం ఉన్నవారు, స్వచ్ఛందంగా ప్రభుత్వంలో విలీనం చేయొచ్చని, లేదంటే యథాప్రకారం నడుపుకోవచ్చని మరోసారి ప్రస్తావించారు. కాగా విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల అమలుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన విద్యా విధానం అమలుకు తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రి ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్ విద్యాసంస్థలు విలీనం చేస్తే.. వారి పేర్లు అలాగే కొనసాగిస్తామని వెల్లడించారు. ప్రభుత్వంలో విలీనానికి ముందు అంగీకరించిన వారు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని.. స్వతంత్రంగా నడుపుకుంటామంటే నిరభ్యంతరంగా వెనక్కి తీసుకోవచ్చని స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి సదుపాయాలు, నాణ్యమైన విద్య అందాలన్నదే తమ ఉద్దేశమని, ఈ ప్రక్రియలో ఎక్కడా బలవంతం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో అపోహలకు గురికావొద్దని, రాజకీయాలు కూడా తగవని స్పష్టం చేశారు.



## ఏపీ గవర్నర్ బిశ్వబూషన్ హరిచందన్‌కు కరోనా

అమరావతి: ఏపీ గవర్నర్ బిశ్వబూషన్ హరిచందన్‌కు కరోనా పాజిటివ్ ఉన్నట్లు వెద్యులు వెల్లడించారు. గవర్నర్ కు కరోనా పాజిటివ్ ఉన్నట్లు ఏఐజీ ఆస్పత్రి వైద్యులు ధృవీకరించారు. ప్రస్తుతం గవర్నర్ హరిచందన్ ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు వెల్లడించారు. హరిచందన్ ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తుందని త్వరలో హెల్త్ బులెటిన్ విడుదల చేయనున్నట్లు వైద్యులు తెలిపారు.



## ఉగ్రవాదులను పోషిస్తున్న పాకిస్థాన్..
## యూఎన్‌లో ఇండియా కౌంటర్




న్యూయార్క్: ఐక్యరాజ్యసమితి వేదికగా మరోసారి పాకిస్థాన్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చింది ఇండియా. భద్రతా మండలి సమావేశాల్లో కశ్మీర్ అంశాన్ని పాకిస్థాన్ ప్రస్తావించడాన్ని ఇండియా తప్పుపట్టింది. యూఎన్‌లోని భారత కౌన్సలర్ డాక్టర్ కాజల్ భట్ దీనిపై మాట్లాడుతూ.. పాకిస్థాన్ నుంచి చొరబడే ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉగ్రవాదం, హింస లేని అనుకూల వాతావరణంలో మాత్రమే అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉంటుందన్నారు. పాకిస్థాన్‌తో సహా అన్ని దేశాలతో ఇండియా సోదర సంబంధాలను ఆశిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే, అవి ద్వైపాక్షికమైనా, సిమ్లా అగ్రిమెంట్, లాహోర్ డిక్లరేషన్ లాంటి వాటిపైన కూడా శాంతియుతంగా చర్చించనున్నట్లు కాజల్ భట్ తెలిపారు. చర్చలకు అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసే బాధ్యత పాకిస్థాన్‌పైనే ఉంటుందని ఆమె అన్నారు. అప్పటి వరకు సీమాంతర ఉగ్రవాదం పట్ల భారత్ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. భారత్‌పై యూఎన్ వేదికగా పాకిస్థాన్ తప్పుడు ప్రచారాలు చేయడం ఇది మొదటిసారి కాదు అని, ప్రపంచ దృష్టిని ఆకర్షించేందుకు పాక్ అనుచిత వ్యాఖ్యలు చేస్తోందని, కానీ ఆ దేశంలో మాత్రం ఉగ్రవాదులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని, సాధారణ ప్రజలకు, మైనార్టీలకు అక్కడ ఇబ్బందులు తప్పడం లేదని కాజల్ అన్నారు.

## కుప్పం ఫలితంతోనైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలి: మంత్రి బొత్స



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల ఆదరణ చెక్కు చెదరడం లేదని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ తెలిపారు. ప్రజల్లో రోజురోజుకీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రజాధరణ పెరుగుతోందన్నారు. ఏపీ మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇలాంటి ఫలితాలు ఎప్పుడూ చూసి ఉండరని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఇది సాధ్యమైందని ప్రశంసించారు. రాష్ట్రంలో సీఎం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు ఈ తీర్పు ఇచ్చారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీకి ప్రజలు 99 శాతం మార్కులు వేశారని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చినమాట నిలనేట్టుకునే దానిపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారనేదానికి ఇది నిదర్శనని స్పష్టం చేశారు. కొన్ని పత్రికలు, చంద్రబాబు నాయుడు బురద జల్లాలని ప్రయత్నం చేసినా ప్రజలు దాన్ని విశ్వసించలేదని కొట్టిపారేశారు. కుప్పం ఫలితంతో అయినా చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. ఇక చంద్రబాబు మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఎద్దేవా చేశారు. గతంలో చంద్రబాబు ఈవీఎంలను నిందించారని, నిన్న దొంగ ఓట్లు అంటున్నాడదని, ఆ భగవంతుడే చంద్రబాబును రక్షించాలని చురకలంటించారు. రెండున్నరేళ్ల తర్వాత కూడా ప్రభుత్వంపై ప్రజలు అదే ఆదరణ అంతకు మించి చూపించారని మంత్రి బొత్స స్పష్టం చేశారు. 'ఇంకా ప్రజాసేవలో మరింత పునరంకితం అవుతాం. ఎక్కడైనా 0.1 శాతం వచ్చిన వైఫల్యాన్ని సమీక్షించుకొని రాబోయే కాలంలో దాన్ని కూడా అధిగమిస్తాం. చంద్రబాబులా కింద పడ్డా పైనే ఉన్నాం అనే పద్ధతి మాది కాదు. ఇప్పటికైనా ఆ పత్రికలు ఆలోచన చేసుకోవాలి. జనసేన, బీజేపీ పార్టీల ప్రభావం రాష్ట్రంలో లేదు. వాటి గురించి చర్చించుకోవాల్సిన అవసరం లేదు. అమరావతి ఉద్యమాన్ని కోర్టు స్వాతంత్ర్య ఉద్యమంగా చెప్పిందని నేనైతే నమ్మడం లేదు. అమరావతి ఉద్యమం తమ ఆస్తులను కాపాడుకోడానికి చేస్తున్నదే. ఓ రాజకీయ పార్టీ చేయిస్తున్న ఉద్యమాన్ని స్వాతంత్ర్య పోరాటంతో పోల్చలేం.

# సంపాదకీయం

గురువారం 18 నవంబరు 2021

## కాలగర్భంలో కలిసిపోతున్న అంతుచిక్కని మరణాలు

చరిత్రలోనే కాదు వ్యక్తుల జీవితాలలోనూ చీకటి కోణాలుంటాయి. అలాగే, కొన్ని చావులు మిస్టరీగా మిగిలి పోతుంటాయి. చరిత్రలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఎప్పుడు ఎక్కడ ఎలా చని-పోయారు అనేది ఇప్పటికీ ఒక మిస్టరీగానే మిగిలి పోయింది. 1945, ఆగస్టు 22న నేతాజీ ప్రయాణించిన యుద్ధ విమానం ప్రమాదానికి గురై ఆయన వీరమరణం పొందినట్లు జపాన్ రేడియో ప్రకటించింది. అయితే ఈ ప్రకటనపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్రప్రభుత్వం నేతాజీకి సంబంధి వంద సీక్రెట్ ఫైళ్లను విడుదల చేసినప్పటికీ ఆయన మరణం వెనుక కారణాలు ఏమిటన్నది ఇప్పటికీ ప్రపంచానికి ఓ మిస్టరీలానే మిగిలిపోయింది. దేశ రాజకీయాల్లో ప్రముఖంగా వినిపించే ఉన్నత కుటుంబానికి చెందిన ఓ ఆడబిడ్డ మెట్టినింట కాలు పెట్టిన తర్వాత కొంత కాలానికి ... ఆ కుటుంబంలో వరసగా అనుమానస్పద మరణాలు సంభవిచాయని అక్కడా, ఇక్కడా వార్తలు వచ్చాయి. అయితే, దశాబ్దాలు గడుస్తున్నా ఈ అనుమానాస్పద మరణాలకు సంబందించిన నిజానిజాలు ఏమిటన్నది మటుకు ఇంతవరకు ప్రపంచానికి తెలియదు. ప్రముఖ రాజకీయ కుటుంబానికి అల్లునిగా వచ్చిన వ్యాపారవేత్త సోదరి, 2001లో అనుమానాస్పద పరిస్థితుల్లో కారు ప్రమాదంలో చనిపోయారు. అయితే అది ప్రమాదం కాదు, హత్య అన్న ఆరోపణలు వచ్చినా, ఆ తర్వాత కథ ఏ కంచికి చేరిందో, ఏమైందో ప్రపంచానికి తెలియదు. ఆతర్వాత రెండేళ్లకు పెద్దింటి అల్లుని సోదరుడు 2003 అనుమానస్పద స్థితిలో హోటల్ గదిలో చనిపోయారు. చివరకు అల్లుడు గారి తండ్రి 2009లో అదే రీతిలో హోటల్ గదిలో అలాగే, అనుమానస్పద స్థితిలోనే చనిపోయారు. అయితే ఇవి .. హత్యలా.. ఆత్మ హత్యలా .. సహజ మరణాలా అన్నది ఇంతవరకు ప్రపంచానికి తెలియదు, ఇక ముందు తెలిసే అవకాశం కూడా లేక పోవచ్చును. అక్కడి నుంచి, అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ కు వస్తే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మరణంపై కూడా అనుమానాలున్నాయి. ఎవరో కాదు వైఎస్ కుటుంబ సభ్యులే పలు సందర్భాలలో, వైఎస్ మంరణం పట్ల అనుమానాలు వ్యక్త పరిచారు. వైఎస్'ను హత్యచేశారని ఆరోపించారు. ఒక ప్రముఖ పారిశ్రామిక వేత్త వైపు వేలెత్తి కూడా చూపారు. అయితే, ఆ తర్వాత ఏమి జరిగిందో ఏమో కానీ, దివంగత నేత పేరు చెప్పుకుని, అధికారంలోకి వచ్చిన ఆయన కుమారుడు ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అదే వ్యాపారవేత్తతో రాజకీయ వియ్యం కలుపుకున్నారు. సో .. వైఎస్ మరణం కూడా ఒక మిస్టరీగానే మిగిలిపోతుంది. నిజానిజాలు ఎలా ఉన్నా, పరిటాల హత్య, కోడెల శివప్రసాద రావు 'అత్మహత్యల' విషయంలోనూ ఇప్పటికీ ఎవరికీ ఉండే అనుమానాలు వారికున్నాయి. అవన్నీ ఒకెత్తు అయితే, మాజీ మంత్రి, మాజీ ముఖ్యమంత్రి సోదరుడు, ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి బాబాయ్ వివేకానందరెడ్డి హత్య మిస్టరీ మర్డర్స్ అన్నిటిలోకీ మరింత మిస్టరీగా మలుపులు తిరుగుతోంది. వైఎస్ మరణం విషయంలో ఆయన సతీమణి విజయమ్మ ఇతర కుటుంబ సభ్యులు ఎలాగైతే అనుమానాలు వ్యక్త పరిచారో .. వివేకా కుటుంబ సభ్యులు కూడా ఆయన మరణం విషయంలో అనుమానాలు వ్యక్త పరిచారు. వివేకా చనిపోయిన రోజున ఆయన కుటుంబ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి తమ పదనాన్న మృతి పట్ల తమకు అనుమానాలున్నాయని, విచారణ జరపాలని మీడియా ముందు డిమాండ్ చేశారు. ఆ రోజున పులివెందుల ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడిన అవినాష్ రెడ్డి 'మా కుటుంబ పెద్ద దిక్కు, పెద్దనాన్న వైఎస్ వివేకానందరెడ్డి మరణం మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. ఆయనది సహజ మరణం కాదు. పెద్దనాన్న మరణం పట్ల మాకు కొన్ని అనుమానాలు ఉన్నాయి. ఆయన తలపై రెండు చోట్ల బలమైన గాయాలు ఉన్నాయి. చేతి, మొహంపై కూడా గాయాలు కనబడుతున్నాయి. మాకున్న అనుమానాలను నివృత్తి చేయాల'ని కోరారు. చిత్రం ఏమిటంటే, ఇప్పుడు ఆ అవినాష్ రెడ్డి పైనే, అనుమానాలు వ్యక్త మావుతున్నాయి. ఆ రోజున ఆయన 'ఉల్టా చోర్ కొత్వాల్ కో ధాంటే' అన్నట్లుగా అనుమానాలు, ఆరోపణలు వినవస్తున్నాయి. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య వెనకున్న శంకర్‌రెడ్డి.. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడని తెదేపా అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. వివేకా మాజీ డ్రైవర్ దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలం, వివేకా కుమార్తె సునీత హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో సైతం శంకర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, భాస్కర్ రెడ్డిల ప్రస్తావన ఉందని పట్టాభి చెప్పారు. వివేకా హత్య జరిగిన రోజు సంఘటనా స్థలానికి చేరుకొని సాక్ష్యాలు తారుమారు చేసి గుండెపోటుగా చిత్రీకరించింది అవినాష్ రెడ్డి, శంకర్‌రెడ్డిలే అని ఆరోపించారు. సిట్‌ను రెండుసార్లు మార్చి సీఎం జగన్ నీరుగార్చే ప్రయత్నం చేశారని పట్టాభి ఆరోపణలు చేశారు. అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలతోపాటుజగన్‌సీబీఐ విచారించాలని ఆయన డిమాండ్ చేశారు.రాజకీయ విమర్శ లు, ఆరోపణలుఉన్నప్పటికీ, వివేకామర్డర్ మిస్టరీ ఎప్పటికైనా విడి పోతుందా .. దోషులకు శిక్ష పడుతుందా... ఈ బేతాళ ప్రశ్నకు బదులేది ..

## పచ్చ కండువా కప్పుకోనున్న రావెల



గుంటూరు, నవంబర్ 17, (న్యూస్ పల్స్)మాజీ మంత్రి రావెల కిషోర్ టీడీపీలో చేరేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ప్రధానంగా ఆయనను ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ సీటును పొత్తులో భాగంగా ఎవరికి ఇచ్చినా ఒప్పుకోమని కూడా ప్రత్తిపాడు టీడీపీ నేతలు చంద్రబాబుకు అల్టిమేటం ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో రావెల కిషోర్ బాబు పరిస్థితి రాజకీయంగా మరోసారి ఇబ్బందిగా మారనుంది.

రాజకీయాలలోకి రాగానే...? రావెల కిశోర్ బాబు ఐఆర్ఎస్ అధికారి నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. 2014 లో సరైన స్టెప్ వేశారు. తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఆయనకు ప్రత్తిపాడు నియోజకవర్గం టిక్కెట్ ను చంద్రబాబు కేటాయించారు. ఎస్సీ నియోజకవర్గం కావడం, టీడీపీకి ఆ ఎన్నికల్లో జనం అండగా నిలబడటంతో రావెల కిశోర్ బాబు గెలిచారు. అయితే ఆయన అదృష్టం బాగుండటంతో వెంటనే మంత్రి పదవిని కూడా దక్కించుకున్నారు. సొంత పార్టీలోనే... కానీ రావెల కిశోర్ బాబు ప్రత్తిపాడు నియోజకవర్గంలో స్వతంత్రంగా వ్యవహరించేందుకు ప్రయత్నించారు. అదే ఆయనకు ముప్పు తెచ్చింది. ప్రత్తిపాడు నియోజకవర్గం ఎస్సీ అయినా అక్కడ కమ్మ సామాజికవర్గం నేతలదే ఆధిపత్యం. దీంతో రావెల కిశోర్ బాబును మంత్రి పదవి నుంచి తప్పించారు. ఇక మంత్రి వర్గం నుంచి తనను తప్పించిన తర్వాత రావెల కిశోర్ బాబు ఎమ్మెల్యే టర్మ్ పూర్తయ్యేంత వరకూ పార్టీలోనే ఉండి ఆ తర్వాత జనసేనలోకి జంప్ చేశారు. మళ్లీ ప్రయత్నాలు... 2019 ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసి ఓడిపోయిన రావెల కిశోర్ బాబు ఫలితాల తర్వాత బీజేపీలోకి జంప్ అయ్యారు. కానీ బీజేపీలో ఉన్నా మరోసారి గెలవలేమని భావించి ఆయన టీడీపీకి దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజధాని రైతులు చేస్తున్న పాదయాత్రలోనూ ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు. దీంతో పాటు పల్నాడుకు చెందిన టీడీపీ నేతతో రాయబారం పంపినట్లు తెలిసింది. అయితే రావెల ప్రయత్నాలు తెలుసుకున్న ప్రత్తిపాడు టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. మొత్తం మీద టీడీపీలో వెళ్లేందుకు రావెల చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవచ్చు.

## తడిసి మోపడవుతున్న ఖర్చులు

విజయవాడ, నవంబర్ 16, (న్యూస్ పల్స్)ఏపీలో ఐఏఎస్ అధికారులు హడలెత్తిపోతున్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా దివాలా తీయిస్తున్న ఏపీ సర్కార్ నిధులు ఇవ్వాలంటూ ఎప్పుడు ఏ శాఖపై పడుతుందో అని తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ పెద్దల తీరుతో ఒక్కొక్క శాఖ నిర్వహణకు కూడా నిధుల్లేక అల్లాడిపోయే దుస్థితిలోకి వెళ్లిపోతున్నాయి. శాఖల నిధులు ఇవ్వడం ఫైనాన్షియల్ కోడ్ కు విరుద్ధం.. ఆ విషయమే చెబితే తమను ఉండనిస్తారా? అని పలువురు ఐఏఎస్ లు ఆందోళన చెందుతున్నారు.రోజువారీ ఖర్చుల కోసం కూడా ఏపీ సర్కార్ ఏదో ఒక శాఖపై పడి నిబంధనలకు విరుద్ధంగా నిధులు తరలించుకుపోతోంది. అడిగిన విధంగా నిధులు ఇవ్వని ఆయా శాఖల ఐఏఎస్ లను ప్రాధాన్యం లేని శాఖలకు బదిలీచేసి భయపెడుతోంది. ఏపీలో ఏ ఇద్దరు ఐఏఎస్ అధికారులు కలిసినా ఇప్పుడు ఇదే అంశంమీద చర్చ జరుగుతోంది. గతంలో ఏ ఇద్దరు ఐఏఎస్ లు ప్రైవేటుగా కలుసుకున్నా.. ఆరోగ్యాలు, వీకెండ్ టూర్ ల గురించి మాట్లాడుకునే వారు. ఇప్పుడు వారిలో ఆ పరిస్థితి లేదు. వచ్చే నెల జీతాలు వస్తాయా? లేదా అని వారి సంభాషణల్లో కనిపిస్తోంది. అప్పు కోసం గవర్నర్ నే బుక్ చేసిన ప్రభుత్వ పెద్దలు తమను మాత్రం ఎలా వదిలిపెడతారనే టెన్షన్ ఐఏఎస్ లలో పెరిగిపోతోంది.రాష్ట్రంలోని ఆర్థికశాఖే కాకుండా అన్ని శాఖలూ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయి. సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితిలోకి శాఖలు వెళ్లిపోతున్న వైనం ఐఏఎస్ అధికారుల మాటల్లో వ్యక్తం అవుతోంది. తప్పు అని తెలిసినా ప్రభుత్వ పెద్దల వత్తిడితో తమ తమ శాఖల్లోని నిధులు ఇవ్వక తప్పడంలేదని వారు నిట్టూర్పులు విడుస్తుండడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా దివాలా తీయడం తథ్యం.. అయితే.. అది ఎప్పుడనేదే తేలాలని ఓ ఐఏఎస్ వ్యక్తం చేసిన ఆందోళన. ఏపీ దివాలా తీసిన వాస్తవాన్ని అరచేయి అడ్డంపెట్టి దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మరో అధికారి అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నాళ్లుగా ఆర్థిక శాఖకే పరిమితమైన సంక్షోభం ఇప్పుడు అన్ని శాఖల్నీ చుట్టేస్తోందని వారు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.మా శాఖలో ఉన్న కొద్దిపాటి నిధుల్నీ ప్రభుత్వం లాగేసుకుంది. ఇన్నాళ్లూ ఆ డబ్బులపై వచ్చే వడ్డీతోనే ఉద్యోగులు జీతాలు, పెన్షన్లు, ఆఫీసు నిర్వహణ నడుస్తోంది. మా శాఖ డబ్బుల్ని తిరిగి ప్రభుత్వం ఇస్తుందనే నమ్మకం లేదు. ఉద్యోగులకు

### కిం కర్తవ్యం... అయ్యా ఎస్ లు

జీతాలు ఇవ్వలేని దుస్థితి అతి త్వరలోనే దాపురిస్తుందనే భయం మరో ఐఏఎస్ అధికారి మాటగా ఉంది. డబ్బుల కోసం ప్రభుత్వం తనపై ఒత్తిడి తీరును సహచర ఐఏఎస్ లతో పంచుకున్నారు. 'నిధుల గోల్ మాల్ పై భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వాలు విచారణ చేయిస్తే.. తమ పరిస్థితి ఏంటనే కలవరం పలువురిని పట్టుకుందని తెలుస్తోంది. తమ శాఖలో రెండేళ్లుగా పేమెంట్ల లేవని, చిన్న చిన్న మెయింటెనెన్స్ బిల్లులు కూడా కట్టలేని పరిస్థితి నెలకొందని, ఇలా అయితే.. ఆఫీసులు ఇంకెన్నాళ్లు నడపగలమంటే ఓ ఐఏఎస్ వాపోతున్నారట. ఈ పరిస్థితి చూసి సెలవుపెట్టి వెళ్లిపోవాలనిపిస్తోందని కొందరు ఆవేదనతో చెప్పుకుంటున్నారని సమాచారం. గతంలో కాస్త ఫేవర్ చేసినందుకే సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మి జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్న విషయం వారు గుర్తుచేసుకుంటున్నారు.బడ్జెట్ లో కేటాయించిన డబ్బులు శాఖలకు ఇవ్వాల్సింది పోయి.. రివర్స్ లో అన్ని శాఖల నుంచీ నిధుల్ని ప్రభుత్వం లాగేసుకుంటోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ శాఖ ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకుని 'నో' చెబితే బదిలీ చేసి మరీ లాగేసుకుంటోందని కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు కట్టిన ఫీజులు, పరీక్షల నిర్వహణకు వచ్చిన నిధుల్ని కూడా విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి సతీష్ చంద్ర ప్రభుత్వానికి ముట్టజెప్పిన వైనాన్ని పలువురు ఐఏఎస్ లు ప్రస్తావించుకుంటున్నారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ రామకృష్ణ తమ వద్ద ఉన్న 500 కోట్ల రూపాయలు ఇచ్చేందుక నిరాకరించారు. అంతే.. ఆయనను ఊహించని విధంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు బదిలీ అయిపోయారు.ఇలా ఒక్కటేమిటి ప్రతి శాఖ నుంచి నిధులు లాక్కుపోయేందుకు ప్రభుత్వం రకరకాల ఫీట్లు చేస్తోందీ ప్రభుత్వం.ఈ ప్రభుత్వం తీరు కారణంగా ఐఏఎస్ లు, ప్రభుత్వ సలహాదారులు వినియోగిస్తున్న కార్లకు కూడా నెలనెలా అద్దె చెల్లించే పరిస్థితి లేదు. ఒక్కో కారుకు నెలకు 60 వేల చొప్పున ఆరు నెలల అద్దె బకాయిలు ఉన్నాయట. దీంతో యజమానులు ఏ క్షణమైనా అద్దె కార్లను ఆపివేసే చాన్స్ ఉంది.

## ఇవాళ సూర్యకాంతం పోస్టల్ స్టాంప్

కాకినాడ, నవంబర్ 17, (న్యూస్ పల్స్)తెలుగు చలనచిత్ర రంగంలో 'సహజనటి'గా పేరుగాంచిన డాక్టర్ సూర్యకాంతం పేరున తపాలాశాఖ ప్రత్యేక కవరు విడుదల చేయనుంది. ఈ నెల 18న దీనిని ఆవిష్కరించనున్నట్టు కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ డీఎస్‌యూ నాగేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈమె కాకినాడకు చెందిన వారు. తెలుగు వెండితెరపై గయ్యాళి అత్తయ్యగా పేరుపొందిన ఈ నటీమణి పేరున కాకినాడ ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహినిలో 'ప్రత్యేక తపాలా చంద్రిక ఆవిష్కరణ' జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, మేయర్ సుంకర శివప్రసన్న, విశాఖ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ ఎం. వెంకటేశ్వర్లు హాజరవనున్నారు. 1924 అక్టోబరు 28న కాకినాడ సమీపంలోని వెంకట కృష్ణరాయపురంలో జన్మించిన సూర్యకాంతం చిన్నప్పటి నుంచే అల్లరి అమ్మాయిగా ముద్ర పడిపోయారు. కాకినాడ యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్‌లో నాటకాలు వెయ్యడం ద్వారా అంజలి, ఆదినారాయణరావు, ఎస్వీ రంగారావు లాంటి ప్రముఖులతో పరిచయం ఏర్పడింది. అదే ఆమెకు వెండితెరపై ఆసక్తిని పెంచింది. తొలి రోజుల్లో చిన్న చిన్న గుర్తింపు లేని పాత్రలకే సూర్యకాంతం పరిమితమయ్యారు.వరద గోదావరిలా సంభాషణలు వల్లించగల సామర్థ్యం ఉన్న ఆమె 'ధర్మాంగత' చిత్రంలో మూగపాత్ర ధరిచారు. అయితే హీరోయిన్‌గా నటించినా మాటలు లేకపోవడంతో ఓ మంచి అవకాశం అలా జారిపోయింది. 1950లో ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్ హీరోలుగా ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన సంసారం సినిమా సూర్యకాంతం కెరీర్‌ను ఓ మలుపు తిప్పింది. ఆ చిత్రం కయ్యాలమారిగా..గయ్యాళి గంపగా నిలబెట్టింది. అక్కడి నుంచి ఒకటా, రెండో ఎన్నో సినిమా అవకాశాలు క్యూ కట్టాయి. ఆమె కోసమే పాత్రల్ని.. సంభాషణలు చిత్రీకరించేవారంటే అతిశయోక్తి కాదు.ప్రముఖ నటులిద్దరు హీరోలుగా నటించిన సినిమాలో ఆమె పాత్ర పేరుతోనే 'గుండమ్మ కథ' తీశారంటే సూర్యకాంతం స్థాయి అర్థం చేసుకోవచ్చు. తాను తింటూ నలుగురికి పెట్టడం ఆమె గొప్ప లక్షణాలని సూర్యకాంతం గురించి తెలిసిన వారు చెబుతుండేవారు. సినిమాలో 'అత్తరికాన్ని' చెలాయించి ప్రేక్షకుల గుండెలపై చెరగని ముద్ర వేసుకున్న ఈ మహానటి 1994 డిసెంబరు 18న కన్నుమూశారు. ఎన్ని తరాలు మారినా తెలుగుతనం ఉన్నంతవరకూ గుర్తుండిపోయే అతి తక్కువ సహజ నటుల్లో సూర్యకాంతం ఒకరు. ఇంతటి మహానటి మన జిల్లాకు చెందిన వారు కావడం గర్వకారణం.

## కమలాపురంలో ఎగిరిన వైకాపా జెండా

కడప నవంబర్ 17, (న్యూస్ పల్స్)ఏపీలోని 12 మున్సిపాలిటీలు, నగరపంచాయతీల ఓట్ల లెక్కింపు ఫలితాలు వైసీపీ దూకుడుకు అద్దం పడుతున్నాయి.ఈ నేపథ్యంలో కడప జిల్లాలోని కమలాపురం నగర పంచాయతీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసింది. కమలాపురం మునిసిపాలిటీలోని 20 వార్డుల్లో 15 వైసీపీ, 5 వార్డుల్లో టీడీపీ గెలుపొందింది. 01, 06, 12, 13, 19 వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు.2, 3, 4, 5, 7, 8, 9, 10, 11, 14,15, 16, 17,18, 20 వార్డుల్లో వైసీపీ అభ్యర్థుల విజయం కేతనం ఎగరవేశారు. కమలాపురం మునిసిపల్ తొలి ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడం విశేషం. దీంతో వైసీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. 3 వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు స్వల్ప మెజారిటీతో గెలవడంతో రీ కౌంటింగ్ నిర్వహించారు. ఉత్కంఠగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగింది.కొన్ని వార్డుల్లో టీడీపీ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ కమలాపురంలో వైసీపీ జెండా ఎగరవేసింది.

## టీడీపీ ఖాతాలో దర్శి పంచాయతి

ఒంగోలు నవంబర్ 17, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్‌లోని మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రకాశం జిల్లా దర్శి నగర పంచాయతీ టీడీపీ కైవసం చేసుకుంది. రాష్ట్రంలో అధికారంతో పాటు, దర్శిలో అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండడంతో వైసీపీ ప్రతిష్టాత్మకంగా ఎన్నికలను తీసుకోగా.. చివరకు విజయం మాత్రం టీడీపీ వశం అయ్యింది. మొత్తం 13వార్డుల్లో టీడీపీ గెలవగా.. ఆరు వార్డుల్లో వైసీపీ గెలిచింది. ఒక వార్డును వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది.తొలిసారి దర్శి నగర పంచాయతీకి జరిగిన ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో టీడీపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర మొత్తం అధికార పార్టీ ఫ్యాన్ గాలి వీస్తుంటే దర్శిలో అనుహ్యంగా టీడీపీ విజయకేతనం ఎగురవేసింది. దర్శి నగర పంచాయతీలో మొత్త 20 వార్డుల గానూ టీడీపీ 13 వార్డులు గెలుపొందగా, 7 స్థానాలు వైసీపీకి దక్కాయి. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తల సంబరాలు చేసుకున్నారు.దర్శిలో టీడీపీ వ్యూహం ఫలించింది.

## మరి కొంత మంది నేతల జంప్

విజయవాడ, నవంబర్ 17, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో వలసలు అనేవి సహజమే. నాయకులు అవసరాన్ని బట్టి, అవకాశాన్ని బట్టి పార్టీలు మారిపోతూ ఉంటారు. ముఖ్యంగా ప్రతిపక్షాల్లో ఉండే నాయకులు..అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతారు. ఎక్కడైనా ఇదే పరిస్తితి ఉంటుంది. ఇక ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీలోకి కూడా ప్రతిపక్ష టీడీపీ నేతలు పెద్ద ఎత్తున చేరుతూనే వచ్చారు. వైసీపీ అధికారంలోకి రాగానే చాలామంది టీడీపీ నేతలు..ఆ పార్టీలో చేరిపోయారు.అలాగే నలుగురు ఎమ్మెల్యేలు సైతం వైసీపీ వైపుకు వచ్చారు. అయితే గతేడాది నుంచి పెద్దగా వలసలు మాత్రం నడవటం లేదు. జంపింగులు ఆగిపోయాయి. మరి వలసలు ఆగిపోవడానికి కారణాలు మాత్రం తెలియడం లేదు. ఒకవేళ వైసీపీలో ఫుల్‌గా నాయకులు ఉండటం వల్ల వలసలు ఆగాయో లేక టీడీపీ కూడా బలపడుతుందని నాయకుల జంపింగ్‌లు ఆగాయనేది మాత్రం క్లారిటీ లేదు.కానీ వలసలకు కాస్త బ్రేక్ పడింది?అయితే టీడీపీ నేతలు ఇంకా తమతో టచ్‌లోనే ఉన్నారని వైసీపీ నేతలు చెబుతున్నారు. టీడీపీలో ఉన్న ముఖ్య నేతలు జగన్‌కు టచ్‌లోకి వచ్చారని, త్వరలోనే కీలక నేతలు వైసీపీలో చేరతారని ఎంపీ విజయసాయిరెడ్డి చెబుతున్నారు. పలువురు టీడీపీ ముఖ్యనేతలు తమతో టచ్‌లో ఉన్నారని, వారితో సంప్రదింపులు జరుగుతున్నాయని, 2024 ఎన్నికలనాటికి టీడీపీ పూర్తిగా ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.టీడీపీ ఖాళీ అవుతుందనే విషయం పక్కనబెడితే, ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు మాత్రం వైసీపీకి టచ్‌లో ఉన్నారని తెలుస్తోంది. మరి ఆ కీలక నేతలు ఎవరనేది మాత్రం క్లారిటీ లేదు. అయితే గంటా శ్రీనివాసరావు లాంటి ముఖ్య నేతలు వైసీపీ వైపు చూస్తున్నారని ఎప్పటినుంచో ప్రచారం నడుస్తోంది. ఆయనతో పాటు పలువురు నేతలు వైసీపీలో చేరే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మొత్తానికైతే టీడీపీ నుంచి ఇంకా జంపింగులు ఉంటాయని అర్థమవుతుంది.

## కొత్త చేరికలు లేక జనసేన డీలా

ఏలూరు, నవంబర్ 17, (న్యూస్ పల్స్)ఏ పార్టీ అయినా పది కాలాల పాటు బతికి బట్ట కట్టాలంటే పదవులు అవసరం. అందుకే రాజకీయ పార్టీని కొత్తగా పెట్టినా అన్ని ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రయత్నిస్తారు. జగన్ కొత్త పార్టీని 2011లో పెట్టారు. వెంటనే ఉప ఎన్నికలకు సిద్ధమయ్యారు. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పోటీ చేశారు. క్రమంగా క్షేత్ర స్థాయిలో బలం పెంచుకుంటూ పోయారు. దశాబ్దకాలాలుగా బలంగా ఉన్న టీడీపీని ఎదుర్కొనాలంటే స్థానిక సంస్థల ఎన్నికలే ముఖ్యమని సీరియస్ గా తీసుకుని తగిన విజయాలను సాధించారు. కానీ పవన్ కల్యాణ? ఆలోచన వేరే విధంగా ఉంది. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టి ఏడేళ్లు కావవస్తుంది. ఆయన 2014లో జనసేన పార్టీని పెట్టారు. అయితే ఇప్పటి వరకూ ఆయన 2019 ఎన్నికల్లోనే పోటీ చేశారు. కేవలం ఒక్క స్థానాన్ని మాత్రమే సాధించారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసినా పెద్దగా ఫలితాలు కన్పించలేదు. అక్కడక్కడ టీడీపీతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను జనసేన పార్టీ గెలుచుకుంది. ఇప్పుడు పార్టీ పరంగా కాకుండా పవన్ కల్యాణ్ నుంచి కింది స్థాయి నేతల వరకూ ఎవరికీ ఎటువంటి పదవి లేదనే చెప్పుకోవాలి. ఎవరూ ఇటు వైపు.... అందుకే జనసేన వైపు ఎవరూ చూడటం లేదు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం ఇలా కాదని పవన్ కల్యాణ్ కు అనేక సూచనలు అందుతున్నా ఆయన పట్టించుకోవడం లేదు. ఆయనకు తనపై తప్ప మరెవ్వరిపైనా నమ్మకం లేకపోవడమే ఇందుకు కారణం. రాజకీయాలు అన్న తర్వాత నమ్మకమే ముఖ్యం. నేతలను నియోజకవర్గాల్లోకి ఫ్రీ హ్యాండ్ ఇచ్చి వదిలిపెడితేనే పార్టీ బలోపేతం అవుతుందని సూచిస్తున్నా పవన్ పట్టించుకోవడం లేదు. ఏ పార్టీలోనైనా పదవులు వస్తాయని తెలిస్తేనే ఎగబడతారు. నేతలకు రాజకీయ భవిష్యత్ పై భరోసా నాయకుడు ఇవ్వగలగాలి. అప్పుడే చేరికలు ఉంటాయి. ఏడేళ్ల నుంచి నేతలు వీడటమే తప్ప ఎటువంటి చేరికలు లేకపోవడం జనసేన అధినేత బలహీనతకు నిదర్శనమనే చెప్పాలి. పవన్ కల్యాణ్ కింగ్ మేకర్ అవుతారని మొన్నటి వరకూ అందరూ భావించేవారు. కానీ ఇప్పుడు మాత్రం ఆయన వీక్ నెస్ అర్థమై.. ఆయన తమను ఏం చేయలేరన్న ధీమాను ప్రత్యర్థులు ప్రకటిస్తున్నారంటే ఆయన ఎంత బలహీనంగా మారారో చెప్పనక్కరలేదు.

## గంగవరం... ఆశలు అడియాశలు

విశాఖపట్టణం, నవంబర్ 17, (న్యూస్ పల్స్)విశాఖలోని గంగవరం పోర్టు నిర్మాణం జరిగితే తమ బతుకుల్లో మార్పు వస్తుందని భావించిన గంగవరం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన మూడు వేల మంది మత్స్యకారుల ఆశలు అడియాసలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వచ్చే ప్రైవేట్ పోర్టు కోసం చంద్రబాబు పాలనా కాలం 2000 డిసెంబరులో జరిగిన ఎంఒయుతో వందల ఎకరాల భూములు త్యాగం చేసిన మత్స్యకార కుటుంబాలకు సరైన పునరావాసం కల్పన జరగలేదు. పైగా, పోర్టు కాలుష్యంతో తీవ్ర అనారోగ్యం బారినపడిన పడ్డారు. ఈ నేపథ్యంలో గంగవరం మత్స్యకార ప్రజలతో అప్పటి టిడిపి ప్రభుత్వం, గంగవరం పోర్టు యాజమాన్యం చేసుకున్న ఒప్పందాలు నేటికీ అమలు కాలేదు. ఇంటికొక ఉద్యోగం చొప్పున ఉద్యోగాలు, నల్లమారమ్మ పాదాల వద్ద జెట్టీ నిర్మాణం వంటి హామీలకు ఆ తర్వాత వచ్చిన వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు అమలు చేయకుండా మత్స్యకారులకు ద్రోహం చేస్తూ వచ్చాయి. జెట్టీ నిర్మాణంతో పాటు, పోర్టు విస్తరణ పెరుగుతున్న కొద్దీ మత్స్యకారులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పినా, ఇంతవరకు 300 మంది మత్స్యకార నిర్వాసితులకు మాత్రమే గంగవరం పోర్టు సర్వీసెస్ (జిపిఎస్)లో ఉపాధి కల్పించారు.ఏ ఒక్కరికీ గంగవరం పోర్టు లిమిటెడ్ (జిపిఎల్)లో ఉద్యోగాలు కల్పించలేదు. జిపిఎల్‌లో ఉద్యోగం వస్తే జీవనానికి గ్యారెంటీ ఉంటుంది. పోర్టు యాజమాన్యం హామీని ఉల్లంఘించి వేతనాలు, సౌకర్యాలు తక్కువగల జిపిఎస్ విభాగంలో ఇవ్వడంపై తొలినుంచీ మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను అమ్మివేయడంతో కేంద్రంలోని బిజెపి ఆశీస్సులతో ఈ పోర్టును అదానీ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హామీల అమలు చేయాలని కోరుతూ మత్స్యకారులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.771 మందికి గంగవరం పోర్టులో ఉద్యోగాలు కల్పించాలని హైకోర్టులో మత్స్యకార కుటుంబాల యువకులు, పెద్దలు ఆనాడు కేసు వేశారు. మత్స్యకారుకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చినా ప్రైవేట్ పోర్టు యాజమాన్యం ధిక్కరిస్తూ వచ్చింది. గంగవరం పోర్టు నిర్మాణం అయ్యాక అది వెదజల్లే కాలుష్య కోరల్లో గంగవరం పరిధిలోని మూడు శివారు గ్రామాలూ విలవిల్లాడుతున్నాయి. ఊపిరితిత్తుల వ్యాధులు, చర్మ వ్యాధుల సమస్యలు, కళ్లు మంటలతో పురుషులు, స్త్రీలు బాధలుపడుతున్నా గంగవరం యాజమాన్యం ఏనాడూ స్పందించలేని స్థానిక మత్స్యకారులు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను పోర్టు ఏరియా నుంచి తరలించాలని డిమాండ్ చేస్తున్నా పాలకులు మొండిగా తిరస్కరిస్తూ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు.

# అసెంబ్లీ సమావేశాల్లో14 ఆర్డినెన్సుల బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం

## గురువారం అసెంబ్లీ సమావేశం

వెలగపూడి నవంబర్ 17, (న్యూస్ పల్స్)రాష్ట్ర శాసనసభ గురువారం ఒకరోజు సమావేశం కానుంది. అదేరోజు ఉదయం 8:30 గంటలకు శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ, 9:30 గంటలకు శాసనమండలి వ్యవహారాల సలహా కమిటీ సమావేశాలు నిర్వహించి ఉభయ సభల్లో చర్చించాల్సిన, పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై నిర్ణయం తీసుకుంటారు. గురువారం సమావేశంలో మహిళా సాధికారతపై స్వల్పకాలిక చర్చ చేపట్టే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ఈ ఏడాది మే 20న ఒకరోజు అసెంబ్లీ సమావేశమైంది. అది జరిగి శుక్రవారానికి ఆరు నెలలు అవుతుంది. ఆరు నెలలు ముగిసేలోపు అసెంబ్లీని మళ్లీ సమావేశపరచాల్సి ఉంటుంది. అందుకే గురువారం ఒకరోజు సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరులో లేదా వచ్చే నెలలో వారం/పది రోజులపాటు పూర్తిస్థాయి సమావేశాలను నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఎనిమిది జిల్లాల పరిధిలోని 11 స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇవన్నీ ఏకగ్రీవమైతే మాత్రం అసెంబ్లీ సమావేశాలు ఈ నెలాఖరులోనే మళ్లీ జరగొచ్చు. ఒకవేళ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ జరిగే పరిస్థితి వస్తే డిసెంబరు మూడోవారంలో సమావేశాలను నిర్వహించవచ్చని ప్రభుత్వ వర్గాల నుంచి అందిన సమాచారం. అయితే ఈ ఏడాది జులై 27 నుంచి నవంబరు 9వ తేదీ మధ్య రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మొత్తం 14 ఆర్డినెన్సులకు సంబంధించిన బిల్లులను సమావేశల్లో ప్రవేశపెట్టే అవకాశముంది. రాష్ట్రంలోని ఎయిడెడ్ విద్యాసంస్థలకు ప్రభుత్వ గ్రాంటు నిలిపివేత, వ్యవసాయ భూములకు “ల్యాండ్ పార్సిల్ నంబరు” ఇచ్చేలా వీలు కల్పించే చట్ట సవరణలతోపాటు మద్యం విక్రయిస్తూ వ్యాపార నిర్వహణే ప్రధాన విధిగా ఉన్న ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్)కు సంక్షేమ పథకాలు అప్పగించే కీలక చట్ట సవరణల ఆర్డినెన్సులూ జాబితాలో ఉన్నాయి. సినిమా టికెట్లకు సంబంధించిన, భూములు, పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించిన, మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన ఆర్డినెన్సుల బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

# వైసిపి నాయకులు టిడిపి లో చేరిక

## మాజీ మంత్రి కిడారి శ్రవణ్ కుమార్

విశాఖపట్నం నవంబర్ 17, (న్యూస్ పల్స్)అరకు నియోజకవర్గం దుంబ్రిగుడ మండలం కీత లాంగి పంచాయితీ పరిశీల గ్రామంలో తెలుగుదేశం పార్టీ అవగాహన సదస్సులో మాజీ మంత్రి శ్రవణ్ కుమార్ అరకు పార్లమెంటు కోశాధికారి వి నాగేశ్ నాగేశ్వరరావు అధ్యక్షతన సుమారు 50 మంది వైసిపి కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు ఈ కార్య క్రమానికి బాకూరు వెంకటరమణ రాజుగారు అరకు పార్లమెంటు టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి ఎం స్వామి గారు మండల పార్టీ అధ్యక్షుడుటి వమాజీ పార్టీ అధ్యక్షుడు కే.సుబ్బారావు ఎస్టి శైలు అధ్యక్షుడు భాస్కర్ రావు పార్లమెంటు రైతు సంఘం అధ్యక్షుడు కూడా భూషణం గారు సర్పంచ్ పాండురంగ స్వామి గారు హుకుంపేట మాజీ జెడ్పిటిసి సుబ్బారావు గారు మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కలకలం రేపిన భారీ కొండ చిలువ

పుట్టపర్తి నవంబర్ 17, (న్యూస్ పల్స్)పదిహేను అడుగుల భారీ కొండ చిలువ బుధవారం సత్యసాయి సోలార్ ప్లాంట్ లో సాయి సేవకులను పరుగులు ఎత్తించింది. పుట్టపర్తి లో సత్యసాయి డిగ్రీ కళాశాల సమీపంలోని సోలార్ ప్లాంట్ లో 15 అడుగుల కొండ చిలువ సాయి సేవకులను భయభ్రాంతులకు గురి చేసింది. సత్య సాయి డిగ్రీ కళాశాల వెనుకవైపున సోలార్ ప్లాంట్ వద్ద పిచ్చి మొక్కలను తొలగించడానికి వెళ్లిన సాయి సేవకులు భారీ కొండ చిలువను చూచి హడల్ ఎత్తిపోయి పరుగులు తీశారు. అంత పెద్ద పాముని చూసి సేవకులు భయ భ్రాంతులకు గురయ్యారు. సమాచారాన్ని కళాశాల సిబ్బంది అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.హుటాహుటిన పాము ఉన్న ప్రాంతానికి వచ్చి గంట సేపు శ్రమించి అతి కష్టం మీద చాక చక్యంగా ఆ భారీ కొండ చిలువను బంధించి సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలి పెట్టడం తో అక్కడున్న వారందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇంత పెద్ద పాము ఈ మధ్యకాలంలో చూడలేదని పామును చూసిన సేవకులు, కళాశాల సిబ్బంది ఆశ్చర్యానికి లోనయ్యారు. వర్షాకాలంలో ఎక్కువగా జనావాసాలలోకి పాములు వస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

# కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో అనూహ్య పరిణామం ...!!

## అంచనాలను తలకిందులు చేస్తూ జరిగిన హోరా హోరీ పోటీ ....
## అత్యంత కీలకంగా మారిన ఇండిపెండెంట్ అభ్యర్థి...
## కొండపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం ఫామ్ కావాలంటే మ్యాజిక్ ఫిగర్ 15 డివిజన్లు..

విజయవాడ నవంబర్ 17, (న్యూస్ పల్స్) ప్రతిష్టాత్మక కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది.. 15 వార్డుల మ్యాజిక్ ఫిగర్ కి గాను అధికార వైసీపీ 14, ప్రతిపక్ష టిడిపి కి 14 సీట్లు గెలుచుకున్నాయి. . దీంతో నూతన కొండపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం ఫామ్ కావడం కోసం మరో సీటు కావల్సింది.. ఈ క్రమంలో ఇండిపెండెంట్ అభ్యర్థి అత్యంత కీలకంగా మారారు. ఇండిపెండెంట్ అభ్యర్థి ఏ పార్టీకి మద్దతు ఇస్తే ఆ పార్టీ మున్సిపల్ పగ్గాలు చేపట్టే అవకాశం ఉంది...

# విశాఖలో వైకాపా హవా

విశాఖపట్నం విశాఖ జీవీఎంసీ ఉపఎన్నికల్లో వైసీపీ హవా కొనసాగింది. జీవీఎంసీ పరిధిలో ఉన్న 31,61 వార్డుల్లో ఉపఎన్నికలకు ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ రెండు వార్డుల్లో 61వ వార్డులో టిడిపి పోటీ చెయ్యకపోవడంతో వైసీపీ గెలుపు లాంచనంగా మారింది. అయితే 31వ వార్డులో మాత్రం టిడిపి గెలుపుపై భారీగా అంచనాలు వేసుకుంది. గతంలో ఈ వార్డు నుంచి గెలిచిన వానపల్లి రవికుమార్ చేసిన సేవ కార్యక్రమాలే ఉపఎన్నికల బరిలో నిలిచిన రవికుమార్ సతీమణి వానపల్లి గాయత్రి ఫణికుమారి గెలుపుకు దోహదపడతాయని భావించారు. అయితే ఈ వార్డులో 31 వార్డులో 59 ఓట్ల మెజారిటీతో వైసీపీ అభ్యర్థి బిపిన్ జైన్ విజయం సాధించారు.61వ వార్డులో 2028 ఓట్ల మెజార్టీతో జనసేన అభ్యర్థిపై వైసీపీ అభ్యర్థి కొణతాల సుధ గెలుపొందారు. 61వ వార్డులో వైసీపీ అభ్యర్థికి 4,952 ఓట్లు రాగా... జనసేన అభ్యర్థికి 2,924 ఓట్లు వచ్చాయి. అలాగే 31వ వార్డులో వైసీపీ అభ్యర్థికి 3087 ఓట్లు రాగా... టీడీపీకి 3028 ఓట్లు, జనసేనకు 359 ఓట్లు పోలయ్యాయి.ఈ రెండు వార్డులో వైసీపీ గెలుపోదడంతో వైసీపీ శ్రేణులు పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నా యి.

# ఘన విజయం సాధించిన 26వ డివిజన్ వైకాపా అభ్యర్థిని బూడిద సుప్రజా

## సంబరాలు చేసుకున్న డివిజన్ నాయకులు

నెల్లూరు నవంబర్ 17 నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ అభ్యర్థినిగా పోటీచేసిన బూడిద సుప్రజ కార్పొరేషన్ ఎన్నికలలో ఘన విజయం సాధించారు. నెల్లూరు నగర పాలక శాఖ పరిధిలోని 54 డివిజన్లు ఉండగా, వాటిలో 8 డివిజన్లను వైకాపా ఏకగ్రీవం చేసుకుంది. ఈ నెల 15న జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో 46వ డివిజన్ లలో వైకాపా అభ్యర్థులు పోటీ చేశారు. అందులో భాగంగానే స్థానిక 26వ డివిజన్ వైకాపా ఇంచార్జి మరియు అభివృద్ధి కమిటీ చైర్మన్ బూడిద పురుషోత్తం యాదవ్ సతీమణి బూడిద సుప్రజా పోటీలో నిలిచారు. పురుషోత్తం యాదవ్ డివిజన్ ప్రజలకు అందించిన సేవా సహకార కార్యక్రమాలకుగాను సుప్రజను స్థానిక ప్రజలు ఆదరించి విజయ ప్రధాన నిలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు వైకాపా నాయకులు కార్యకర్తలు అభిమానుల ఆశీస్సులు నా విజయానికి నాంది అని అన్నారు.

డివిజన్ అభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను డివిజన్ లోని ప్రతి ఒక్కరికి అందే విధంగా తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

# కుప్పం ప్రజలు వాస్తవాలను గుర్తించారు

తాడేపల్లి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది. దాంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకున్నారు. పార్టీ నేతలు నృత్యాలు వేస్తూబాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాస్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, విజయవాడ నగర మేయర్ భాగ్య లక్ష్మి , పలు కార్పొరేషన్ ల చైర్మన్లు,పార్టీ నేతలు పాల్గొన్నారు. తరువాత మీడియాతో మంత్రులు మాట్లాడారు.మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రబాబు పతనం ఎప్పుడో ప్రారంభమైంది. ఇప్పుడు క్లైమాక్స్ కి వచ్చింది. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి రాష్ట్రంలో లేదని అందరికీ తెలుసు. ఆయన కంచుకోటగా భావించే కుప్పంలో కూడా లేదని ఇప్పుడు మళ్లీ తేలిపోయిందని అన్నారు.మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ చంద్రబాబు స్వీయతప్పిదాలే టీడీపీ పతనానికి కారణం. చంద్రబాబు అమరావతి ఒక్కటే తన ఎజెండా అనుకున్నారు. అందుకే మిగతా ప్రాంతాల ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. ఇప్పుడైనా వాస్తవ పరిస్థితులను చంద్రబాబు గమనించాలి. కుప్పం ప్రజలు వాస్తవాలను గుర్తించారు కాబట్టే చంద్రబాబును పక్కన పెట్టారని అన్నారు.రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబుకు వ్యవస్థలను మేనేజ్ చేయటమే తెలుసు. ప్రజల ప్రేమను,అభిమానాన్ని ఎలా పొందాలో తెలియదు. ప్రతిసారీ చంద్రబాబు కుయుక్తులు పనిచేయవు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే మమ్మల్ని గెలిపిస్తున్నాయని అన్నారు.ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ పని అయిపోయింది. ఇక ఆపార్టీ ఆఫీసులను అద్దెకి ఇచ్చుకోవటమే మిగిలింది. ఇప్పటికే కొన్ని జిల్లాలో అద్దెలకు ఇచ్చేశారు. రాష్ట్రంలో తన పని అయిపోయిందని తెలిసే చంద్రబాబు రాష్ట్రంలో ఇల్లు కట్టుకోలేదు కనీస ఓటు హక్కు కూడా కుప్పంలో లేదు. 35 ఏళ్లుగా చంద్రబాబు నాటకాలు చూసి తట్టుకోలేకనే అక్కడి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు.

# ఇంద్రకీలాద్రిలో కోటి దీపోత్సవం

విజయవాడ నవంబర్ 17 విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో, ఉన్న ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో 18వ తేదీన సాయంత్రం 6 గంటలకు కోటి దీపోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్టు దుర్గ గుడి ఆలయ స్థానాచార్యులు, గుడి ఈవో భ్రమరాంబ పేర్కొన్నా రు. కోటి దీపోత్సవం కార్యక్రమానికి విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద స్వామి జీ అతిథిగా రానున్నారు. ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో 19వ తేదీన ఉదయం 6 గంటల నుంచి గిరిప్రదక్షిణ నిర్వహించనున్నామని, ఇంద్రకీలాద్రి ఆలయం చుట్టూ 8 కిలోమీటర్ల మేరకు గిరిప్రదక్షిణ ఉండనుందన్నారు.గిరి ప్రదక్షణకు రెండున్నర గంటల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. గిరి ప్రదక్షిణలో దేవస్థాన ప్రచార రథంతో పాటు నడవలేని వారికి మినీ బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రదక్షిణ చేసే భక్తుల కోసం మెడికల్ క్యాంపు, ఉచిత ప్రసాదం, ఆంబులెన్స్‌లు, మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయనున్నారు. కోవిడ్ నిబంధనలను పాటిస్తూ గిరి ప్రదర్శన చేయవలసిందిగా ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

## ఇమ్దాద్ ఉల్ ముస్లిమీన్ యూత్ ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవం
## ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు ఘన సన్మానం

.కోరుట్ల నవంబర్ 17 నిజాన్ని నిర్భయంగా నిస్వార్థంగా తమ గళంతో తమ కలంతో ప్రపంచానికి వినిపిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ సమాజాన్ని ప్రభావితం చేయడంలో పత్రికలలు,జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తాయని ఇమ్దాద్ ఉల్ ముస్లిమీన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి.వాజీద్అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకునికోరుట్ల పట్టణంలోని ఇమ్దాద్ ఉల్ ముస్లిమీన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్ లోని వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఘనంగా శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు వాజీద్ మాట్లాడుతూ అసాధ్యాన్ని సుసాధ్యం చేసే శక్తి ఒక పత్రిక ప్రపంచానికి మాత్రమే ఉందని సమాజంలో నెలకొన్న సమస్యలను అధికారుల ,ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కార దిశగా జర్నలిస్టుల పనిచేస్తారని కొనియాడారు.సమాజాన్ని ఉపయోగపడే వార్తలు, కథనాలను వ్రాసి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు సీనియర్ జర్నలిస్టుల సలీం ఫారుఖీ , ఇలియాస్ ఖాన్,జర్నలిస్టులు ఎండి.సాజీద్ అలీ ,ఎండి .ముబిన్ ,ఎండి .ముసావీర్,ఎండి సలావోద్దిన్ ,ఎండి.చాంద్ పాష ,ముక్రం మిర్జా, మహ్మద్ అలీ ,బాణాల శ్రీధర్,అల్లం నరేష్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలోతెరాస మైనారిటీ పట్టణాధ్యక్షుడు సయ్యద్ ఫాయిం ,అధ్యక్షుడు ఎండి వాజీద్ ,ఉపాధ్యక్షుడు షాఖాన్ ,ప్రధాన కార్యదర్శి సల్మాన్,కోశాధికారి సమిద్ , ఎండి సల్మాన్,ముబిన్, శాకీర్ ,యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మరో వాయు గండం

విశాఖపట్టణం, నవంబర్ 17, (న్యూస్ పల్స్)అగ్నేయ బంగాళా ఖాతం దాని సరిహద్దుని ఆను కొని ఉన్ననైరుతి బంగాళా ఖాతంలో కేంద్రీకృతమై ఉందని అమరావతి వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. అంతేకాదు ఈ అల్పపీడనం దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సముద్రమట్టము నకు 5 .8 కి.మీ ఎత్తు వరకువ్యాపించి ఉందన్నారు. ఈ అల్ప పీడనం పశ్చిమ దిశగా ప్రయాణించి , పశ్చిమ మధ్య , దానిని ఆను కొని ఉన్ననైరుతి బంగాళా ఖాతం వద్ద నున్న దక్షిణ ఆంధ్ర ప్రదేశ్ , ఉత్తర తమిళనాడు తీరాన్నిరేపు ఉదయం తాకనుందని చెప్పారు. మరొక అల్పపీడన ద్రోణి అరేబియా సముద్రం దాని పరిసర ప్రాంతమైన గోవా, దక్షిణ మహారాష్ట్ర తీరం నుంచి దక్షిణ తమిళనాడు వరకు గల అల్పపీడనం, దానికి అనుబంధంగా గల ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 4 .5 కిలోమీటర్లు వరకు విస్తరించి ఉందన్నారు. దీంతో రాగాల మూడు రోజుల వరకూ ఆంధ్ర ప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఉత్తర కోస్తా ఆంధ్ర, యానాం : ఈరోజు తేలికపాటినుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉంది. అంతేకాదు రేపు, ఎల్లుండి పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముంది. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒకటి లేదా రెండు చోట్లఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉంది.దక్షిణ కోస్తా ఆంధ్ర: ఈరోజు తేలికపాటినుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది . ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒకటి లేదా రెండు చోట్లఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉంది. రేపు, ఎల్లుండి తేలికపాటినుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉ రుములతో కూడిన జల్లులు చాలా చోట్ల కురిసే అవకాశముంది . భారీ నుండి అతి భారీ మరియు అత్యంత భారీ వర్షాలు ఒకటి లేక రెండు చొట్ల కురిసే అవకాశముంది. ఒకటి లేదా రెండు చోట్లఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉంది.రాయలసీమ : ఈరోజు తేలికపాటినుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం



ఉంది. ఒకటి లేదా రెండు చోట్లఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉంది. రేపు, ఎల్లుండి తేలికపాటినుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉ రుములతో కూడిన జల్లులు చాలా చోట్ల కురిసే అవకాశముంది. భారీ నుండి అతి భారీ మరియు అత్యంత భారీ వర్షాలు ఒకటి లేక రెండు చొట్ల కురిసే అవకాశముంది. ఒకటి లేదా రెండు చోట్లఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం

# వార్ ఎప్పుడైనా వన్ సైడే

చిత్తూరు నవంబర్ 17చిత్తూరు కుప్పం మున్సిపాలటీ ఎన్నికల్లో టీడీపీని చిత్తు చేసి వైసీపీ పార్టీ విజయం సాదించింది.అయితే.. ఈ విజయం పై నగరి వైసీపీ ఎమ్మెల్యే రోజా ఫుల్ జోష్ లో కనిపించారు. తన బర్త్ డే సందర్భంగా వైసీపీ గెలవడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ ఏ ఎన్నికలు వచ్చిన వార్ వన్ సైడేనని నలబై ఏళ్ళ ఇండస్ట్రీ అయినా చంద్రబాబు తరిమి కొట్టారని ఎద్దేవా చేశారు.కుప్పంలోనే ఇల్లు లేని చంద్రబాబును హైదరాబాదు ఇంటికి పరిమితం చేశారన్నారు. చంద్రబాబు, లోకేష్ ఇకనైనా నోరు అదుపులో పెట్టుకోవాలని కుప్పం ప్రజలు జగన్ వెంటనే ఉన్నారని స్పష్టం చేశారు. ఢిల్లీ చక్రం తిప్పుతాననే చంద్రబాబు కుప్పం మున్సిపాలిటీలు బొక్క బోర్ల పడ్డారని చురకలు అంటించారు. తండ్రి, కొడుకులు తట్ట బుట్టా సద్దుకుని హైదరాబాదు పోవాలన్నారు. వైకాపాను గెలిపించిన కుప్పం ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు రోజా.

# బుచ్చిలో జరుగుతున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



నెల్లూరు నవంబర్ 17 . నెల్లూరు జిల్లా, బుచ్చి నగర పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ను జిల్లా కలెక్టర్ కె. వి. ఎన్. చక్రధర్ బాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లెక్కింపు ప్రక్రియ వివరాలను బుచ్చి నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాస రావు కలెక్టర్కు వివరించారు. ఎన్నికల అబ్జర్వర్ మరియు కౌంటింగ్ ఏజెంట్ సమక్షంలో కౌంటింగ్ పక్రియ ప్రశాంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాబు మాట్లాడుతూ ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు, అవకతవకలు జరగకుండా తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఫలితాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బుచ్చి నగర పంచాయితీ అయిన తర్వాత ఇదే తొలి ఎన్నికలు కావడంతో గెలుపు ఓటముల పై స్థానిక ప్రజలు ఎదురు చూశారు. ఎట్టకేలకు వైకాపా ఘన విజయం సాధించింది. టిడిపి గట్టిపోటీ ఇచ్చినప్పటికీ స్వల్ప విజయాలు సాధించారు. స్థానిక శాసనసభ్యులు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో బుచ్చి నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజను వరించింది. ఈ మేరకు స్థానిక వైకాపా నాయకులు కార్యకర్తలు అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

# వారపు సంతల్లో నకిలీ వస్తువులు విక్రయాలు

## జనసేన ఎక్స్ ఎంపిటిసి, సాయిబాబా, దూరియా

విశాఖపట్నం నవంబర్ 17 . అరకు నియోజకవర్గం అనంతగిరి మండలం డముకు వారపు సంతలో గిరిజనులకు జరుగుతున్న నిలువుదోపిడి ని తక్షణమే సంబంధిత అధికారులు అరికట్టాలని జనసేన పార్టీ ఎక్స్ ఎంపిటిసి సాయిబాబా, దూరియా సన్యాసిరావు, గెమ్మెల ప్రభుత్వానికి డిమాండ్ చేసారు. దముకు బుధవారం సంతలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పర్యటించి, నకిలీ వస్తువులను పరిశీలిస్తూ, ఇకపైన ఇటువంటివి నకిలీ వస్తువులు గిరిజనులకు అమ్మితే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకుని వెళ్తామని వ్యాపారస్తులు తో సూచించారు, అనంతరం ఈ సందర్భంగా సాయిబాబా సన్యాసి రావు మాట్లాడుతూ వారపు సంతల్లో గిరిజనులకు నిలువు దోపిడి చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం, ఇష్టారాజ్యంగా వ్యాపారస్తులు నిలువు దోపిడీ చేయడం అలవాటుగా మారిపోయిందని, వారపు సంతల్లో గిరిజనులు పండించిన పంటకు కారుచౌకగా మైదాన ప్రాంతం నుండి వచ్చినటువంటి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారని, ఒకపక్క తూకంలో మోసం చేస్తున్నారని వారపు సంతల్లో నకిలీ వస్తువుల ఖైని గుట్కా జోరుగా మరింత పెరుగు పోతున్న సంబంధిత అధికారులు నిర్లక్ష్యం కారణంగా గిరిజనులు మరి అంత నిలువుదోపిడి గురవుతున్నారని దీనిపై ప్రభుత్వం ఒక కన్నేసి సంత లో జరుగుతున్న అక్రమ నిలువుదోపిడీ అరికట్టాలని, గిరిజనుల పండించిన పంటను గిట్టుబాటు ధర కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి జనసేన పార్టీ డిమాండ్ చేసారు. అనంతరం సంతలో నిలువు దోపిడీ అరికట్టాలని ప్రభుత్వానికి నిరసన ద్వారా తెలిపారు, ఈ కార్యక్రమంలో జనసైనికులు పండు జీవన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ ఎన్నికలలో ఎగిరిన వైకాపా జెండా

నెల్లూరు నవంబర్ 17 నెల్లూరు బుచ్చిరెడ్డిపాలెం కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 15న జరిగిన బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించి, వైకాపా జెండాను ఎగురవేశారు. రెడ్డిపాలెం నగర పంచాయతీ ఎన్నికలలో 20 వార్డులకు గాను 18 వార్డులలో వైకాపా అభ్యర్థులు విజయం సాధించారు. 1వ వార్డు వైకాపా అభ్యర్థి కత్తి నాగరాజు, 3వ వార్డు వైకాపా అభ్యర్థిని అందే ప్రత్యూష,4 వ వార్డు కౌన్సిలర్ మరియు చైర్పర్సన్ అభ్యర్థిని మోర్ల సుప్రజా, 5వ వార్డు అభ్యర్థి షేక్ షాహుల్, 6వ వార్డు అభ్యర్థి రహమత్, 7వ వార్డు అభ్యర్థిని షేక్ షకీలా, 8 వ వార్డు పటాన్ నస్రీన్, 9 వ వార్డు అభ్యర్థి ఎరటపల్లి శివ కుమార్ రెడ్డి, 10వ వార్డు బెల్లం మల్లారెడ్డి, 11వ వార్డు అభ్యర్థి రాసూరి సత్యనారాయణ , 12వ వార్డు అభ్యర్థి కందుకూరి యానాదిరెడ్డి, 13వ వార్డు అభ్యర్థిని పుట్టా లక్ష్మీకాంతమ్మ , 14వ వార్డు అభ్యర్థి చీర్ల ప్రసాద్, 15 వ వార్డు అభ్యర్థిని కంట అనంతమ్మ, 16వ వార్డు అభ్యర్థి బిట్రగుంట ప్రమీలమ్మ, 18వ వార్డు అభ్యర్థిని మోర్ల జయంతి , 19వ వార్డు అభ్యర్థిని కోటంరెడ్డి లలిత, 20వ వార్డు కౌన్సిలర్ వైకాపా అభ్యర్థిని కత్తి శ్రీదేవి తదితరులు వైకాపా అభ్యర్థులుగా పోటీలో నిలిచి తమ ప్రత్యర్థులపై ఘన విజయం సాధించారు.

# కార్పొరేషన్ ఎన్నికలలో 33 వ డివిజన్ విజయం ప్రజా విజయం

## 33 వ డివిజన్ అభ్యర్థిని కరణం మంజుల

నెల్లూరు నవంబర్ 17ఈ నెల 17న జరిగిన నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలలో 33 వ డివిజన్ విజయం, ప్రజా విజయమని 33 వ డివిజన్ వైకాపా అభ్యర్థిని కరణం మంజుల పేర్కొన్నారు.నగర పాలక సంస్థ సాధారణ ఎన్నికలలో 33 వ డివిజన్ నుంచి వైఎస్సార్ సిపి అభ్యర్థి కరణం మంజుల గెలుపొందారు. ఈ డివిజను నుంచి బిజెపి అభ్యర్థిగా నిలిచిన మండల కామాక్షి - 1392, వైఎస్సార్ సిపి అభ్యర్థిగా నిలిచిన కరణం మంజుల - 2727, టిడిపి అభ్యర్థిగా నిలిచిన జలదంకి ధనమ్మ - 932,ఇండిపెండెంట్ అభ్యర్థిగా పిక్కిలి జోష్ణవి - 11,నోటా - 61 ఓట్లుగా నమోదయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆయన సోదరుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు, వైకాపా అభిమానులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తన భర్త అయిన హజరత్ నాయుడు డివిజన్ ఇంచార్జి గాను, అభివృద్ధి కమిటీ చైర్మన్ గాను ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.

# వందేభారతం నృత్య ఉత్సవ్ పోటీలకు ధరఖాస్తులు

-రిపబ్లిక్ డే పరేడ్ 2022 వద్ద విూద్దైన శైలిలో నృత్యం చేసే అవకాశం
-డిజిటల్ ప్రవేశాలు 17 నుంచి ప్రారంభం..25 చివరి తేది

విశాఖపట్టణం నవంబర్ 17 కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆద్వర్యం లో వందే భారతం?నృత్య ఉత్సవ్? ను ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అఖిల భారత నృత్య పోటీలు జరుగానున్నాయి.ఈ పోటీల ముఖ్య లక్ష్యం దేశవ్యాప్తంగా అత్యున్నత నృత్యకళాకారులను ఎంపిక చేయడంతో పాటుగా గణతంత్ర్య దినోత్సవ పరేడ్ 2022 నాడు సాంస్కృతిక కార్యక్రమ సమయంలో తమ ప్రదర్శనలిచ్చే అవకాశం కల్పించడం. ఈ ప్రదర్శన జనవరి 26,2022 నాడు రాజ్‌పథ్,ఇండియా గేట్ (న్యూఢిల్లీ) వద్ద జరుగనుంది. సాంస్కృతిక శాఖ సహాయమంత్రి మినాక్షీ లేఖి ఈ విషయాన్ని వెల్లడించడంతో పాటుగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ మొబైల్ యాప్‌ను సైతం విడుదల చేశారు. ఈ సందర్భంగా మినాక్షీ లేఖి మాట్లాడుతూ " ఈ 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ మనం మన సాంస్కృతిక వైభవాన్ని మహోన్నతంగా చాటడంతో పాటుగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ద్వారా భారతదేశపు మహోన్నతమైన భవిష్యత్‌ను సైతం వెల్లడిచేయాలని ప్రధానమంత్రి తరచుగా చెబుతుంటారు" అని అన్నారు.వందేభారతం గ్రూప్ డ్యాన్స్ పోటీలు 17 నవంబర్ 2021వ తేదీ నుంచి డిజిటల్ ప్రవేశాలను జిల్లా స్థాయిలో ఆహ్వానిస్తున్నాయి.చివరి తేది నవంబర్ 25.ఈ పోటీలు ముందుగా జిల్లా స్థాయిలో జరిగి, ఆ తరువాత రాష్ట్ర స్థాయి, అనంతరం జోనల్ స్థాయిలో జరిగి చివరకు జాతీయ స్థాయి ఫైనల్స్ జరుగుతాయి. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి గౌరవనీయ రాష్ట్రపతి సహా మహోన్నతమైన వ్యక్తుల ముంగిట ప్రదర్శన ఇచ్చే అవకాశం లభిస్తుంది.ఈ పోటీలో పాల్గొనే అభ్యర్థులు నాలుగు నృత్య విభాగాలలో పోటీ పడవచ్చు.

అవి శాస్త్రీయ, జానపద, గిరిజన మరియు ఫ్యూజన్/సమకాలీన నృత్యాలు. ఈ పోటీల ద్వారా 480 మందిని విజేతలుగా ఎంపిక చేస్తారు."ఈ వేడుకలు మన సంప్రదాయ నృత్య సంస్కృతిని ప్రతిబింబించాలని ప్రధానమంత్రి ఆకాంక్షిస్తున్నారు. దేశ్ భక్తి గీతాలు, లోరీ,రంగోలీ వంటివి వీటిలో ఉండాలి" అని అన్నారు.ఆజాదీ కా అమృత్‌మహోత్సవ్‌ను జన్ భాగిదారి స్ఫూర్తితో ప్రధానమంత్రి తలపెట్టారని మంత్రి వెల్లడించారు. భారతదేశ వ్యాప్తంగా ప్రజలందరినీ ఈ వేడుకలలో భాగం చేసేందుకు ఈ కార్యక్రమాలను ప్రాథమిక స్థాయికి తీసుకుని వెళ్లాల్సి ఉంది.

అంతేకాదు, మన వారసత్వం, సంస్కృతికి యువతను అనుసంధానించడం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో అత్యంత కీలకమైన అంశం అని ఆమె వెల్లడించారు.ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్ స్ఫూర్తితో మొత్తం దేశాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామని ఆమె తెలిపారు. భారతీయతను వేడుక చేయడమే ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లక్ష్యమన్నారు.ఇతర ఉపయుక్త సమాచారం ఈ యాప్, వెబ్‌సైట్ అందిస్తాయని ఆమె తెలిపారు.ఈ పోటీలలో పాల్గొనేందుకు మీ దరఖాస్తులనుతిని వెబ్‌సైట్‌కు లేదా వందే భారతం మొబైల్‌యాప్ డౌన్‌లోడ్ చేసుకుని పంపడం చేయవచ్చు. మంత్రిత్వ శాఖ నిర్వహించే ఇతర పోటీలను గురించిన సమాచారం అంటే దేశ్‌భక్తి గీత్, లోరీ, రంగోలీ పోటీలు కోసం చూడవచ్చు లేదా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# మంత్రి బుగ్గనకు షాక్

కర్నూలు నవంబర్ 17,( విభారె) ఆంధ్రప్రదేశ్లో పలు చోట్ల జరిగిన మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఫలితాలు ఒక్కొక్కటిగా వెలువడుతున్నాయి. పలు చోట్ల టీడీపీకి.. ఇంకొన్ని చోట్ల వైసీపీకి గట్టిగానే షాకులు తగులుతున్నాయి. అయితే.. మంత్రుల స్వగ్రామంలో.. నివాసముండే ప్రాంతాల్లో కూడా టీడీపీ జెండా ఎగిరిందంటే మామూలు విషయం కాదు. అలాంటి సందర్భాలు ప్రస్తుత ఎన్నికల్లో చోటుచేసుకున్నాయి.పూర్తి వివరాల్లోకెళితే.. బేతంచెర్ల మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్కు భారీ షాక్ తగిలింది. బుగ్గన నివాసం ఉండే 15 వార్డులో వైసీపీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. వైసీపీ తరపున పోటీ చేసిన అభ్యర్థిపై టీడీపీ అభ్యర్థి వెంకట సాయి కుమార్ 114 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ గెలుపుతో టీడీపీ శ్రేణులు బేతంచెర్లలో సంబరాలు చేసుకుంటున్నాయి. బేతంచెర్లలో మొత్తం 20 వార్డులుండగా.. వైసీపీ 14, టీడీపీ 6 వార్డుల్లో విజయం సాధించింది.ఇదిలా ఉంటే.. ఇప్పటికే ఇదే జిల్లాలో జరిగిన సర్పంచ్, వార్డులకు జరిగిన ఎన్నికల్లో కూడా వైసీపీ ఊహించని షాక్లే తగిలాయి. కర్నూలు జిల్లా నంద్యాల మండలం భీమవరంలో 4వ వార్డులో వైసీపీ అభ్యర్థి నాగపుల్లారెడ్డిపై టీడీపీ అభ్యర్థి జనార్ధన్ విజయం సాధించారు. 12 ఓట్ల తేడాతో జనార్ధన్ గెలుపొందారు. నంద్యాల వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థి గోకుల కృష్ణారెడ్డి సొంత వార్డులోనే ఇలా ఓటమిపాలవ్వడం గమనార్హం. అలాగే ఎమ్మిగనూరు మండలం కె. తిమ్మాపురంలోనూ వైసీపీ వార్డు అభ్యర్థిపై 38 ఓట్ల తేడాతో సీపీఐ అభ్యర్థి మహేశ్వరి విజయం సాధించారు. కృష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామపంచాయతీ ఎన్నికలో టీడీపీ రెబల్ అభ్యర్థి వరలక్ష్మి 858 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

## సిబిఐ అదుపులో దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి

కడప నవంబర్ 17,( విభారె) వివేకా హత్యకేసు అనుమానితుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి ని సీబీఐ అదుపులోకి తీసుకుంది. హైదరాబాద్లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి లో చికిత్స పొందు తుండగా అతడిని సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తరువాత శివశంకర్ రెడ్డిని హైదరాబాద్ సీబీఐ కార్యాలయానికి తరలించారు. దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కడప ఎంపీ అవినాష్ రెడ్డికి ముఖ్య అనుచరుడుగా ఉన్న విషయం తెలిసిందే. వివేకా మాజీ డ్రైవర్ దస్తగిరి వాంగ్మూలంలో శివశంకర్ రెడ్డి పేరు ప్రస్తావన వచ్చింది. వివేకా కుమార్తె డాక్టర్ సునీత హైకోర్టుకు ఇచ్చిన అనుమానితుల జాబితాలో శివశంకర్రెడ్డి పేరు వుంది. ఇంతకుముందు కడప కేంద్ర కారాగార అతిథి గృహం, పులివెందులలోని అతిథి గృహం లలో పలుమార్లు శివశంకర్ రెడ్డిని సిబీఐ విచారించింది.

# మీకు తెలుసా? పుట్టగొడుగులను ఔషధాలలో కూడా ఉపయోగిస్తారు!



మీరు పుట్టగొడుగుల కూర, మష్రుమ్ చిల్లీ మరియు పుట్టగొడుగుల నుండి వివిధ రకాల వంటకాలను తయారుచేసుకుని తినవచ్చు. హోటల్‌కి వెళ్లి మెను చూస్తే మీరు పుట్టగొడుగులతో తయారుచేసే వివిధ రకాల వంటలకాలను కనుగొనంటారు. మష్రుమ్ ను తెలుగులో పుట్టగొడుగు అంటారు. దీని వల్ల శరీరానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయని చెప్తారు. పుట్టగొడుగులను అలాగే తినవచ్చు లేదా డిష్‌గా తయారుచేసి వడ్డించవచ్చు. దాని సప్లిమెంట్లను ఉపయోగించవచ్చు. తరచుగా పచ్చి పుట్టగొడుగులను తినడం చాలా తక్కువ. నేడు, పుట్టగొడుగులకు ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఖ్యాతి ఉంది. అటువంటి పుట్టగొడుగుల గురించి మీకు తెలియని కొన్ని విషయాలను ఈ వ్యాసంలో మేము మీకు అందించడానికి ప్రయత్నించాము. చదవడానికి మీరు సిద్ధంగా ఉండండి. పుట్టగొడుగులు కూరగాయలు కాదు! పుట్టగొడుగులు కూరగాయలు కాదు! ఇది నిజం. మనం ఎల్లప్పుడూ వంటగదిలో పుట్టగొడుగులను కూరగాయగా భావిస్తాము. కానీ సైన్స్ ప్రపంచంలో పుట్టగొడుగులను శిలీంధ్రాలు అంటారు. వీటికి శక్తిని ఉత్పత్తి చేయడానికి సూర్యరశ్మి అవసరం లేదు. ఇది చీకటి మరియు చల్లని ప్రాంతాల్లో పెరుగుతుంది. అయితే, కూరగాయలలో వలె, పుట్టగొడుగులలో కూడా యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు మరియు ఖనిజాలు ఉంటాయి.:బ్లూ బెర్రీస్ తో బ్రెయిన్ పవర్ పెరుగుతుందని తెలుసా.. శతాబ్దాలుగా ఔషధంగా వాడుతున్నారు శతాబ్దాలుగా ఔషధంగా వాడుతున్నారు పుట్టగొడుగులను చైనాలో శతాబ్దాలుగా ఔషధాల తయారీలో ఉపయోగిస్తున్నారు. జపాన్‌లోనూ గతంలో పుట్టగొడుగులను ఔషధంగా ఉపయోగించేవారు. 16వ శతాబ్దంలో ఇది రష్యా మరియు అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఔషధంగా ఉపయోగించబడింది. పుట్టగొడుగులను ఇప్పుడు చైనా, జపాన్ మరియు కొరియాలో ఉపయోగిస్తున్నారు. 1960ల నుండి నిర్వహించిన అధ్యయనాలు పుట్టగొడుగుల యొక్క ప్రయోజనాలు మరియు వైద్య లక్షణాలను కనుగొన్నాయి. దైవ స్వరూపమైన 'అశ్వత్థ చెట్టు లేదా రావి చెట్టు' ఆకుల ఔషధ గుణాలు..!!దైవ స్వరూపమైన 'అశ్వత్థ చెట్టు లేదా రావి చెట్టు' ఆకుల ఔషధ గుణాలు..!! ఎక్కడ పండించారో తెలుసుకోవడం ముఖ్యం ఎక్కడ పండించారో తెలుసుకోవడం ముఖ్యం పుట్టగొడుగు ఎక్కడ పెరిగిందో, అది దానిలోని ప్రతిదాన్ని గ్రహిస్తుంది. ఇందులో పురుగుమందులు లేదా రసాయనాలు ఉండవచ్చు. ఇది సేవించినప్పుడు శరీరంలో చేరవచ్చు. ఇది పెరిగిన స్థలంలో ప్రతిదీ గ్రహించి దానిని బలోపేతం చేసుకుంటుంది. పుట్టగొడుగులను మెటల్, కలుషితమైన నీరు లేదా గాలిలో పెంచినట్లయితే ఇది శరీరానికి హాని కలిగిస్తుంది. లోహాలు శరీరానికి ముఖ్యంగా హానికరం. పుట్టగొడుగు ఎక్కడ పెరిగిందో తెలుసుకోవడం ముఖ్యం. ఆముదం నూనెలో అందంతో.. ఆరోగ్య ప్రయోజనాలున్నాయని తెలుసా...ఆముదం నూనెలో అందంతో.. ఆరోగ్య ప్రయోజనాలున్నాయని తెలుసా... ఫార్మాస్యూటికల్ ఫంగస్ శరీరం యొక్క రోగనిరోధక వ్యవస్థ ఫార్మాస్యూటికల్ ఫంగస్ శరీరం యొక్క రోగనిరోధక వ్యవస్థ పుట్టగొడుగులు శరీరం యొక్క రోగనిరోధక శక్తిని బలపరుస్తాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. రోగనిరోధక శక్తిని బలోపేతం చేసే గుణాలు పుట్టగొడుగుల్లో ఉన్నాయి. పాలీశాకరైడ్ అనేది శరీరం యొక్క రోగనిరోధక శక్తిని పెంపొందించేది. సూక్ష్మ స్థాయిలో, ఈ అంశం శరీరం యొక్క రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది సాధారణ జలుబు నుండి క్యాన్సర్‌పై పోరాటం వరకు ఉండవచ్చు. కొన్ని పుట్టగొడుగులు యాంటీవైరల్‌ను ఉత్పత్తి చేసి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. విటమిన్ డి యొక్క అధిక మూలం విటమిన్ డి యొక్క అధిక మూలం పుట్టగొడుగు అనేది విటమిన్ డిని అందించే శాకాహార ఆహారం. విటమిన్ డి సూర్యుని నుండి లభించే విటమిన్ ఇందులో ఉన్నందున దీన్ని సూర్య విటమిన్ అని పిలుస్తారు. మనిషి ఆరోగ్యానికి ఇది చాలా అవసరం. శరీరానికి విటమిన్ డి అవసరమని నిపుణులు చెబుతున్నారు. అందుకే పుట్టగొడుగులను శరీరానికి అందించడమే. ఇందులో విటమిన్ బి కాంప్లెక్స్ కూడా ఉంటుంది ఇందులో విటమిన్ బి కాంప్లెక్స్ కూడా ఉంటుంది అవును, పుట్టగొడుగులో వివిధ రకాల విటమిన్ ః2, ః2 రిబోఫ్లావిన్, ః3 నియాసిన్, ః6 మరియు ః12 ఉన్నాయి. ఇవి శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలు. ఇవి మనం తీసుకునే కేలరీలను శక్తిగా మారుస్తాయి. కొన్ని బి విటమిన్లు బాగా పనిచేస్తాయి. ఉదాహరణకు రిబోఫ్లావిన్ రక్తనాళాలకు సహాయపడుతుంది. నియాసిన్ జీర్ణవ్యవస్థకు సహాయపడుతుంది. మనం ప్రతి రోజూ వీటిని తింటే కూడా మంచిది. పుట్టగొడుగులను డిష్‌గా లేదా సప్లిమెంట్‌గా తినవచ్చు. పుట్టగొడుగులలో సహజ యాంటీబయాటిక్ మరియు యాంటీఆక్సిడెంట్ పుట్టగొడుగులలో సహజ యాంటీబయాటిక్ మరియు యాంటీఆక్సిడెంట్ ఇతర సూక్ష్మజీవుల నుండి అన్ని రకాల శిలీంధ్రాలను రక్షించడానికి సహజ యాంటీబయాటిక్ ఉపయోగిస్తుంటాము. ఆహార వనరులు లేదా వ్యాధుల నుండి దూరంగా ఉండండి మరియు వాతావరణను కాలుష్యపరిచే మూలాన్ని నాశనం చేయండి. అవి పెన్సిలిన్ అనే యాంటీబయాటిక్ ఫంగల్ జాతి నుండి వచ్చాయి. పుట్టగొడుగులలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. కొన్ని రకాల పుట్టగొడుగులలో సెలీనియం ఎక్కువగా ఉంటుంది.

# 'అర్జున ఫల్గుణ' లో ఎన్టీఆర్ ఫ్యాన్స్ కోసం..!




యంగ్ హీరోలు ఈమధ్య కాలంలో తమలోని ట్యాలెంట్ ను చూపించేందుకు అన్ని రకాల పాత్రలను చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కేవలం హీరోగా మాత్రమే నటించకుండా విభిన్నమైన పాత్రల్లో నటిస్తూ తమ ప్రతిభను చూపించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఆ హీరోల జాబితాలో ముందు ఉంటాడు శ్రీ విష్ణు. ఆయన హీరోగానే కాకుండా విభిన్నమైన పాత్రల్లో కూడా నటించాడు. కంటిన్యూగా సినిమాలు చేస్తూ ప్రేక్షకుల్లో ఎప్పుడు కూడా నిలిచే శ్రీవిష్ణు త్వరలో అర్జున ఫల్గుణ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్దం అయ్యాడు. ఎప్పటిలాగే ఈ సినిమాలో కూడా ఆయన విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నట్లుగా టీజర్ మరియు ఫస్ట్ లుక్ చూస్తుంటే అర్థం అవుతోంది.విభిన్నమైన కాన్సెప్ట్ తో రూపొందిన ఈ సినిమాలో హీరోగా నటిస్తున్న శ్రీ విష్ణు యంగ్ టైగర్ ఎన్టీఆర్ కు వీరాభిమానిగా కనిపించబోతున్నాడు. ఈమధ్య కాలంలో యంగ్ హీరోలు.. కొత్త హీరోలు తమ సినిమాల్లో స్టార్ హీరోలను చూపిస్తున్నారు. తద్వార సినిమాకు మంచి బజ్ రావడంతో పాటు ఆ హీరో అభిమానులు సోషల్ మీడియాలో తమ సినిమాను ప్రచారం చేస్తారనే ఉద్దేశ్యంతో మేకర్స్ ఈ నిర్ణయంను తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. సోషల్ మీడియాలో ప్రస్తుతం అర్జున ఫల్గుణ సినిమా గురించి ఎన్టీఆర్ అభిమానులు ప్రచారం చేస్తున్నారు. ఎందుకంటే ఈ సినిమా లో శ్రీ విష్ణు ఎన్టీఆర్ కు అభిమానిగా కనిపించబోతున్నాడు. సినిమా లో ఎన్టీఆర్ పేరును పలు సందర్భాల్లో ప్రస్థావిస్తారట. అందుకే అభిమానులు సోషల్ మీడియాలో తెగ హడావుడి చేస్తున్నారు.ఈ సినిమా లో ఎన్టీఆర్ అభిమానిగా శ్రీ విష్ణు కనిపించి జై ఎన్టీఆర్ అంటూ చేసిన సన్నివేశాలు.. ఎన్టీఆర్ సినిమాల విడుదల హడావుడి సీన్స్ కూడా అర్జున ఫల్గుణ లో ఉంటాయట. సినిమాకు ఆ సన్నివేశాలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని మేకర్స్ అంటున్నారు. ఖచ్చితంగా సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకంతో శ్రీ విష్ణు ఉన్నాడు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా లో శ్రీ విష్ణు కు జోడీగా 30 రోజుల్లో ప్రేమించడం ఎలా ఫేమ్ అమృతా అయ్యర్ హీరోయిన్ గా నటించింది. వీరిద్దరి కాంబో సన్నివేశాలు కూడా ఆకట్టుకునే విధంగా ఉంటాయని చెబుతున్నారు. ఒక మంచి గోదావరి కథ.. పల్లెటూరు నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా ప్రతి ఒక్కరిని ఆకట్టుకునే విధంగా ఉంటుందని అంటున్నారు.

# డ్రీం ప్రాజెక్ట్ అదే అంటున్న చెర్రీ... ?



ఏ నటుడికి అయినా మంచి అవకాశాలు రావాలి. కోరుకున్న పాత్రలు చేయాలి. ఈ ఆశ బాగా ఉంటుంది. అలా కనుక ఆలోచిస్తే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కి కూడా డ్రీమ్ క్యారక్టర్స్ బోలెడు ఉన్నాయిట. ట్రిపుల్ ఆర్ తరువాత చరణ్ కోలీవుడ్ డైరెక్టర్ శంకర్ డైరెక్షన్ లో ఒక మూవీ చేస్తున్న సంగతి విధితమే. ఇది ఆయన కెరీర్ లో 15వ చిత్రం. ఈ మూవీ ఇలా ఉండగానే ఇంకో హాట్ ఫేవరేట్ సిన్మాను చెర్రీ లైన్ లో పెట్టేశాడు. జెర్సీ మూవీతో గౌతమ్ తిన్ననూరి బంపర్ విక్టరీ కొట్టాడు. తనలోని స్టామినాను కూడా సినీ లోకానికి తెలియచేశాడు. ఈ మూవీ హిందీ రీమేక్ చేస్తున్న గౌతమ్ తరువాత ప్రాజెక్ట్ ని మాత్రం చెర్రీతో చేస్తున్నాడు. ఈ ఇద్దరి కాంబోలో మూవీ 2022లోనే సెట్స్ మీదకు వస్తుందని అంటున్నారు.ఈ సినిమా అవకాశాన్ని గౌతమ్ తిన్ననూరికి చరణ్ ఇవ్వడానికి చాలా కారణాలు ఉన్నాయట. ఆయన సినిమా టేకింగ్ విధానం తో పాటు సీరియస్ నెస్ అన్నీ నచ్చే చరణ్ నీతో ఒక సినిమా అని ఓకే చెప్పేశాడు అంటున్నారు. ఇక ఈ మూవీకి ఇంకో విశేషం ఉంది. చరణ్ స్పోర్ట్స్ మాన్ గా ఫుల్ లెంగ్త్ రోల్ లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాడుట. సరిగ్గా అలాంటి సబ్జెక్ట్ తో గౌతమ్ తిన్ననూరి చెర్రీతో మీట్ కావడతో మరో మాట లేకుండా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని అంటున్నారు.కంప్లీట్ గా ఈ మూవీ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో సాగుతుంది అంటున్నారు. ఈ మూవీ లో కొత్త చరణ్ కనిపిస్తాడు అని కూడా తెలుస్తోంది. ఒక విధంగా 2022 చెర్రీ కెరీర్ లో ది బెస్ట్ ఇయర్ అని అంటున్నారు. జనవరిలో ట్రిపుల్ ఆర్ ఫిబ్రవరిలో ఆచార్య మూవీస్ తో జనాల ముందుకు వచ్చే చెర్రీ శంకర్ మూవీని కూడా స్పీడ్ గా కంప్లీట్ చేసి అదే ఇయర్ థియేటర్లలో రిలీజ్ చేసేందుకు పక్కా ప్లాన్ తో ఉన్నాడని అంటున్నారు. ఇక 2023లో చరణ్ గౌతమ్ తిన్ననూరి మూవీ రిలీజ్ అయ్యే అవకాశం ఉందిట. సో మెగా పవర్ స్టార్ ఫ్యాన్స్ కి ఇది గుడ్ న్యూసే మరి.

# లేటుగా వచ్చినా లేటెస్టుగా వస్తానన్న మమ్మీ



పెళ్లైన తర్వాత సినిమా రంగంలో రాణించడం కాంప్లికేషన్ తో కూడుకున్నదే. అప్పటికే వయసు 30 దాటిపోతుంది. పెళ్లైపోతుంది కాబట్టి ఇక సెకెండ్ ఇన్నింగ్స్ లో మమ్మీ..అక్క..చెల్లి లాంటి సపోర్టింగ్ రోల్స్ కే పరిమితవ్వాల్సి ఉంటుందంటారు. అయితే ఈ రూల్ ని దీపికా పదుకొణే..కరీనా కపూర్ లాంటి వాళ్లు బ్రేక్ చేసారనే చెప్పాలి. పెళ్లై మామ్స్ అయినా వీళ్లంతా ఇంకా బాలీవుడ్ ని ఏల్తున్నారు. పెళ్లికాని భామల్లా ఎంతో చలాకీగా కెరీర్ ని ముందుకు సాగిస్తున్నారు. ఇదే బాటలో తాను పయనిస్తానంటూ 17 క్రితం ముఖానికి మేకప్ వేసుకుని ప్యాకప్ చెప్పిన ఓ భామ అంటోంది. ఇంతకీ ఎవరు ఆ హీరోయిన్ అంటే అసలు వివరాల్లోకి వెళ్లాల్సిందే.'అబ్ తుమ్హారే హవాలే వతన్ సాథియో' చిత్రంతో బాలీవుడ్ కి పరిచయమైన దివ్య ఖోస్లో కుమార్ సుపరిచితురాలే. ఈ సినిమా తర్వాత దివ్య నటిగా అంత బిజీ కాలేదు. దీంతో నిర్మాతగా..డైరెక్టర్ గా కొన్ని సినిమాలు నిర్మించింది. మళ్లీ మనసు మేకప్ వైపు మళ్లీఇందో ఏమో! 17 ఏళ్ల గ్యాప్ అనంతరం జాన్ అబ్రహం హీరోగా తెరకెక్కుతోన్న 'సత్యమేవ జయతే-2' చిత్రంతో కంబ్యాక్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఇంటర్వ్యూలో ఆసక్తిర విషయాలు వెల్లడించింది. గ్యాప్ తీసుకుని ఎంట్రీ ఇవ్వడం పెద్ద బాధగా లేదు. ఇంకా చెప్పాలంటే సరైన సమయంలోనే కంబ్యాక్ అవుతున్నాను? అన్న సంతోషమే ఉంది.ఇప్పుడున్న రచయితలు నటీమణులకి మంచి పాత్రలు రాస్తున్నారు. నటనకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. ఇక పెళ్లి అనేది సినిమాలకు అడ్డంకి కాదని దీపికా..కరీనా లాంటి వారు నిరూపించారు. 90లలో పరిస్థితులు వేరు. ఇప్పుడు వేరు. అంతా చాలా అప్డేటెడ్ గా ఉన్నాం. ఆరకంగానే ముందుకు వెళ్లిపోతున్నాం. కాబట్టి ఆలస్యమైనా! ఇదే రైట్ టైమ్ అని నాకనిపిస్తుందని" దివ్య ఖోస్లా అన్నారు.

# 'బ్యాటర్'గా విరాట్ కోహ్లీ... టీ20 కెప్టెన్ రోహిత్ శర్మ ఏమన్నాడంటే!



పొట్టి ఫార్మాట్‌లో ఐసీసీ ట్రోఫీ గెలిచి ఘనంగా వీడ్కోలు తీసుకోవాలన్న ఆశ తీరకుండానే విరాట్ కోహ్లీ టీ20 కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. అదే విధంగా భారత హెడ్‌కోచ్‌గా పనిచేసిన రవిశాస్త్రి సైతం కోచింగ్ కెరీర్‌లో ఒక్క మేజర్ ట్రోఫీ కూడా గెలవకుండానే తన బాధ్యతల నుంచి తప్పుకొన్నాడు. ఇక వారిద్దరి స్థానంలో సారథిగా రోహిత్ శర్మ, హెడ్‌కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ విధులు నిర్వర్తించనున్నారు. ఇక ఇన్నాళ్లు టీ20 కెప్టెన్‌గా ఉన్న కోహ్లీ... ఈ ఫార్మాట్‌లో బ్యాటర్‌గా కొనసాగనున్న నేపథ్యంలో రోహిత్ శర్మ తన గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.టీమిండియా టీ20 కెప్టెన్ హోదాలో హిట్‌మ్యాన్ మాట్లాడుతూ... "జట్టులో అత్యంత ముఖ్యమైన వ్యక్తి తను. ప్రతి మ్యాచ్‌లోనూ తన ప్రభావం ఉంటుంది. తన మార్కు చూపిస్తాడు. సుదీర్ఘకాలంగా జట్టుకు సేవలు అందిస్తున్నట్లుగానే ఇప్పుడూ అలాగే ముందుకు సాగుతాడు. తను జట్టులో ఉంటే మాకు బలం. తన అనుభవం మాకు ఎంతగానో ఉపకరిస్తుంది.అయితే, జట్టులో ఒక్కొక్కరి పాత్ర ఒక్కోలా ఉంటుంది. తొలుత బ్యాటింగ్ చేస్తే ఆర్డర్ ఒకలా... ఛేజింగ్ చేస్తే మరోలా.. వీటిపైనే ఆర్డర్ మార్చాలా వద్దా అన్న విషయాలు ఆధారపడి ఉంటాయి. కోహ్లీ లాంటి అద్భుతమైన బ్యాటర్ ఉంటే జట్టుకు విలువ. అదనపు బలం. తన పాత్ర ఎప్పుడూ ఒకేలా ఉంటుంది" అని చెప్పుకొచ్చాడు. కాగా నవంబరు 17 నుంచి న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ ఆరంభం కానున్న నేపథ్యంలో రోహిత్ శర్మ ఈ మేరకు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. ఇక ఈ సిరీస్ నేపథ్యంలో కోహ్లీ సహా పలువురు క్రికెటర్లకు బీసీసీఐ విశ్రాంతినిచ్చిన సంగతి తెలిసిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190